తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | గురువారం-01- మే - 2025 | సంపుటి : 2 | సంచిక : 340 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

## వడగాలులు ఎక్కువ, వర్షపాతం కూడా ఎక్కువే



ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కొంతవరకు వేడి తీవ్రతను తగ్గించనున్నాయి.

మే నెలపై ఐఎండీ తాజా నివేదిక

వివరాలు 2లో..

## హైదరాబాద్ పోలీస్ శాఖలో పెద్ద ఎత్తున మార్పులు




పోలీస్ స్టేషన్లకు కొత్త పేర్లు, సీఐల బదిలీలు

35 ఏళ్ల తర్వాత పాలనా సౌలభ్యం కోసం హైదరాబాద్ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో నూతన అధ్యాయం

వివరాలు 2లో..

# జనాభా లెక్కింపులో కులగణన

## కేంద్రం కీలక నిర్ణయం



**ఢిల్లీ:**

ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. జనగణనలోనే కుల గణన కూడా చేయడానికి కేబినెట్ అంగీకారం తెలిపింది. వచ్చే జనాభా లెక్కల్లో కులగణనను చేరుస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది జనగణన చేపట్టాలని కేబినెట్ నిర్ణయించింది. దీనిలో భాగంగా జనగణనతో కలిపి కుల గణన కూడా చేయడానికి నిశ్చయించింది. 2019లోనే జనగణన చేయాల్సి ఉన్నప్పటికీ కరోనా కారణంగా అప్పుడు ముందుడగు పడలేదు.

దాంతో పాటు షిల్లాంగ్‌సిల్చారు జాతీయ రహదారి నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. 22,864 కోట్ల రూపాయల ఖర్చుతో 166 కిలోమీటర్ల మేర గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణానికి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఫలితంగా త్రిపుర, మిజోరం, మణిపూర్, అస్సాంలోని బరాక్ వ్యాలీకి కనెక్టివిటీ పెరగనుంది. అదే సమయంలో చెరకు మద్దతు ధర క్వింటా రూ. 350 పెంపునకు కేబినెట్ ఆమోదం తెలిపింది. కేబినెట్ భేటీ అనంతరం మంత్రి మండలి నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.

**పహల్గామ్ పై నో డిస్కషన్.. ఓన్లీ సైలెన్స్**


అయితే ఈరోజు జరిగిన కేంద్ర కేబినెట్ భేటీలో పహల్గామ్ ఉగ్రదాడి ఘటనకు సంబంధించి కేబినెట్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అంతా భావించారు. అయితే నేటి భేటీలో ఆ ఉగ్రదాడి ఘటనకు సంబంధించి ఎటువంటి చర్చ లేకుండా భేటీ ముగిసింది. దీనిపై కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఎటువంటి ప్రకటన చేయలేదు. దాంతో దాడికి సంబంధించి ప్రతిచర్యలపై కేంద్రం మౌనం పాటిస్తూ ముందుకెళ్లడం కూడా వ్యూహాత్మక ఎత్తుగడగా విశ్లేషకులు భావిస్తున్నారు.

జన గణనలో కులగణన చేయాలని క్యాబినెట్ నిర్ణయం వచ్చే జనాభా లెక్కల్లో కుల గణన కాలమ్ చేర్చాలని నిర్ణయం బీహార్, బెంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మోడీ కీలక నిర్ణయం

కుల గణన కోసం ఎన్నో ఏళ్లుగా ఉద్యమాలు చేస్తున్న బిసి సంఘాలు కుల గణనను కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎప్పుడూ వ్యతిరేకిస్తూనే ఉన్నాయి.స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి జరిగిన అన్ని జనాభా గణన కార్యకలాపాలలో కులాన్ని చేర్చలేదు.

మిగతా 2లో..

## కుల గణనపై కేంద్ర నిర్ణయాన్ని స్వాగతించిన సీఎం రేవంత్ రెడ్డి



దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. కేంద్రం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేసిన ఆయన, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర క్యాబినెట్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయంతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దార్శనికత నెరవేరబోతోందని అభిప్రాయపడ్డారు. రాహుల్ గాంధీ ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేయగలిగారని పేర్కొన్నారు. దేశంలో కుల గణన ప్రక్రియను ప్రారంభించిన తొలి రాష్ట్రం తెలంగాణ అని, రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగానే రాష్ట్రంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు.కుల గణన ఆవశ్యకతపై కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా పోరాటం చేసిందని, తెలంగాణ కాంగ్రెస్ నేతలు సైతం ఢిల్లీ వేదికగా ఆందోళనలు నిర్వహించారని ఆయన గుర్తు చేశారు. "తెలంగాణ చేసింది.. దేశం అనుసరిస్తోంది" అనే విషయం మరోసారి స్పష్టమైందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.



## ఫాం హౌస్‌లో పడుకుని ప్రతిపక్ష హక్కు ఎట్లా?

- కేసీఆర్ తెచ్చిన ఏ పథకం ఆగిందో చెప్పగలరా?
- బీఆర్ఎస్ సభకు అన్ని బస్సులు ఇవ్వమన్నాం, కానీ సలహాలేమీ రాలేదు
- కొట్లాడి తెచ్చిన తెలంగాణను దోపిడి కోతుల చేతిలో పెట్టారు
- వచ్చే పదేళ్లు మేమే అధికారంలో ఉంటాం... కేసీఆర్ ఫాం హౌస్‌కే పరిమితం
- కేసీఆర్‌పై సీఎం రేవంత్ ఘాటు విమర్శలు

**తెలంగాణ ముచ్చట్లు:**

ముఖ్యమంత్రి రేవంత్ కీలక వ్యాఖ్యలు చేసారు. మాజీ సీఎం కేసీఆర్ పార్టీ సభలో చేసిన కామెంట్స్ పైన ఘాటుగా స్పందించారు. ప్రతిపక్ష పాత్ర పోషించకుండా కేసీఆర్ పిల్లలను సభకు పంపిస్తు న్నారని వ్యాఖ్యానించారు. ప్రజలు అప్పగించిన ప్రతిపక్ష పాత్ర పోషించరా అంటూ నిలదీసారు. తమ ప్రభుత్వంలో పథకాలు ఆగాయని కేసీఆర్ అంటున్నారని.. కేసీఆర్ తెచ్చిన పథకాల్లో ఏది ఆగిందో చెప్పగలరా అని సవాల్ చేసారు.

మిగతా 2లో..

## జాతీయ భద్రతా సలహా బోర్డు పునర్వ్యవస్థీకరణ

- 'రా' మాజీ చీఫ్ అలోక్ జోషికి ఛైర్మన్ బాధ్యతలు
- భద్రతా రంగంలోని అనుభవజ్ఞులకు బోర్డులో చోటు
- దేశ భద్రతకు నూతన దిశ
- ఉగ్రవాద నిర్మూలన లక్ష్యంగా బలమైన భద్రతా వ్యూహం
- పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత కీలక నిర్ణయం

**ఢిల్లీ:**

దేశ భద్రతా యంత్రాంగాన్ని పటిష్టం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ భద్రతా సలహా బోర్డు (ఎన్ఎస్ఏబీ)ను కేంద్ర ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. ఈ బోర్డుకు నూతన ఛైర్మన్‌గా రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్ ('రా') మాజీ అధిపతి అలోక్ జోషిని నియమిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇటీవలే జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడి జరిగిన నేపథ్యంలో, దేశ భద్రతకు సంబంధించిన ఈ కీలక నియామకం ప్రాధాన్యతను సంతరించుకుంది. భద్రతా వ్యవహారాలపై ఏర్పాటైన కేబినెట్ కమిటీ (సీసీఎస్) సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. అలోక్ జోషితో పాటు మరో ఆరుగురు మాజీ ఉన్నతాధికారులను బోర్డులో సభ్యులుగా నియమించారు. వీరిలో వైమానిక దళానికి చెందిన మాజీ అధికారి ఎయిర్ మార్షల్ పీఎం సిన్హా, సైన్యానికి చెందిన రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ ఏకే సింగ్, నౌకాదళ మాజీ అధికారి అడ్మిరల్ మోంటీ ఖన్నా ఉన్నారు. వీరితో పాటు మాజీ ఐపీఎస్ అధికారులు రాజీవ్ రంజన్ వర్మ, మన్మోహన్ సింగ్, మాజీ దౌత్యవేత్త బి. వెంకటేశ్ వర్మలను కూడా సభ్యులుగా ఎంపిక చేశారు.

మిగతా 2లో..





## ఈ ఏడాదికి విద్యుత్ ఛార్జీల పెంపు లేదు: ఈఆర్సీ


- 2025–26 ఆర్థిక సంవత్సరం కోసం యథాతథ టారిఫ్‌లు అమల్లోకి
- డిస్కంల ఆర్థిక లోటు రూ.13,499 కోట్లుగా అంచనా
- వాడకానికి మించి తక్కువగా విద్యుత్ అవసరమన్న ఈఆర్సీ
- రాయితీలకు ప్రభుత్వం హామీ – ఛార్జీల పెంపుకు అవసరం లేదన్న కమిషన్
- కరెంటు ప్రమాదాలపై అవగాహన అవసరం.. యువతలో మృతుల సంఖ్య ఎక్కువ
- 2030 నాటికి విద్యుత్ కొరత నివారణకు కొత్త ప్లాంట్లు అవసరం

**తెలంగాణ ముచ్చట్లు:**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (202526)లో విద్యుత్తు ఛార్జీల పెంపు లేదని, యథాతథంగా పాత పద్ధతిలోనే కరెంటు వసూలు చేయాలని డిస్కంలను రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) ఆదేశించింది. ఈమేరకు కరెంటు ఛార్జీల టారిఫ్ ఉత్తర్వును మంగళవారం మండలి కార్యాలయంలో ఎలెక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ డి.నాగార్జున్ విడుదల చేశారు. ఈ ఉత్తర్వు మే 1(గురువారం) నుంచి అమల్లోకి వస్తుందని వెల్లడించారు. రాష్ట్రంలోని రెండు డిస్కంలు, రాజన్న సిరిసిల్లలోని సెస్‌తో కలిపి మొత్తం మూడు విద్యుత్ సంస్థల ఆర్థికలోటు రూ.13,499.41 కోట్లు ఉంటుందని ఈఆర్సీ తెలిపింది. ఈ ఏడాదికి ఆర్థిక లోటు దాదాపుగా రూ.20,151 కోట్లు ఉంటుందని గత సంవత్సరం నవంబరులో డిస్కంలు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరపిన ఈఆర్సీ అంతకు రూ.6,652 కోట్లు తక్కువగా అంటే రూ.13,499.41 కోట్లు ఉంటుందని వెల్లడైనట్లు ఛైర్మన్ తెలిపారు. వ్యవసాయానికి విద్యుత్తు వినియోగం ఎక్కువగా అవసరం ఉంటుందని భావించి డిస్కంలు ఎక్కువ లోటు చూపాయని, కానీ అంత ఉండదని ఈఆర్సీ విచారణలో నిర్ధారించినట్లు ఛైర్మన్ వివరించారు.

మిగతా 2లో..

## టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 పరీక్షలో అవకతవకలపై హైకోర్టు కీలక ప్రశ్నలు



- వారసత్వ హాల్‌టికెట్లు, ఒకే మార్కులపై కోర్టు దృష్టికి పిటిషనర్లు
- తెలుగు, ఆంగ్ల, ఉర్దూ మాధ్యమాలపై వేర్వేరు కీ పేపర్లు ఉన్నాయా? కోర్టు ప్రశ్న
- తెలుగు మాధ్యమంలో పరీక్ష రాసిన వారి వివరాలు సమర్పించాలని ఆదేశం
- తదుపరి విచారణ గురువారానికి వాయిదా

వివరాలు 5లో..



## ఆర్టీసీ భవిష్యత్ కోసం సమ్మెపై పునరాలోచించండి

- ఆర్టీసీ పరిస్థితి పరిగణలోకి తీసుకుని నిర్ణయం తీసుకోండి
- సమ్మె అవసరం లేదని, ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి సిద్ధమే
- రోడ్డు ప్రమాదాల రహిత తెలంగాణే లక్ష్యం
- కార్మిక నేతలతో చర్చలకు తాను సిద్ధమన్న మంత్రి పొన్నం ప్రభాకర్

**తెలంగాణ ముచ్చట్లు:**

ఆర్టీసీ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని, కార్మిక నేతలు సమ్మెపై పునరాలోచన చేయాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం సమ్మె చేయాల్సిన పరిస్థితుల్లో ఆర్టీసీ లేదని, ఆర్టీసీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికుల పోరాటం వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. తిరుమలగిరిలో సారథి పోర్టల్ ప్రారంభం, రవాణా శాఖ కార్యాలయం ఆధునీకరణ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం, ఆర్టీసీ పరిరక్షణ అంశాలపై ప్రభుత్వం కట్టుబడి ఉందని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు.

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక


# జనాభా లెక్కింపులో కులగణన

(మొదటి పేజీ తరువాయి)

కుల గణన అంశాన్ని కేబినెట్‌లో పరిశీలిస్తామని 2010లో అప్పటి ప్రధాని దివంగత డాక్టర్ మన్మోహన్ సింగ్ లోక్‌సభకు హామీ ఇచ్చారు.ఈ అంశాన్ని పరిశీలించేందుకు మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేశారు. చాలా రాజకీయ పార్టీలు కుల గణనను సిఫార్సు చేశాయి. కుల గణనకు బదులు సర్వే మాత్రమే చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఆ సర్వేనే SECC అంటారు. కాంగ్రెస్ మరియు దాని భారత కూటమి భాగస్వామ్య పక్షాలు కుల గణనను రాజకీయ సాధనంగా మాత్రమే ఉపయోగించుకున్నాయని బాగా అర్థమైంది.భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 246 ప్రకారం, సబ్జెక్ట్ సెన్సస్



ఏడవ షెడ్యూల్‌లోని యూనియన్ జాబితాలో 69గా జాబితా చేయబడింది. భారత రాజ్యాంగం ప్రకారం, జనాభా గణన అనేది యూనియన్ సబ్జెక్ట్. కొన్ని రాష్ట్రాలు కులాలను లెక్కించేందుకు సర్వేలు నిర్వహించాయి. కొన్ని రాష్ట్రాలు దీన్ని బాగా చేశాయి, మరికొన్ని పారదర్శకంగా రాజకీయ కోణం నుండి ఇటువంటి సర్వేలను నిర్వహించాయి. ఇలాంటి సర్వేలు సమాజంలో అనుమానాలకు తావిస్తున్నాయి. ఈ వాస్తవాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని, రాజకీయాల వల్ల మన సామాజిక వ్యవస్థకు భంగం కలగకుండా చూసేందుకు, కుల గణనను సర్వేలకు బదులు పారదర్శకంగా జనాభా గణనలో చేర్చాలి. ఇది దేశం పురోగమిస్తూనే మన సమాజం యొక్క సామాజిక మరియు ఆర్థిక నిర్మాణాన్ని బలోపేతం చేస్తుంది. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీజీ నేతృత్వంలో, రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ, ఈ రోజు (30 ఏప్రిల్, 2025) రాబోయే జనాభా గణనలో కుల గణనను చేర్చాలని నిర్ణయించింది. గతంలో మా ప్రభుత్వం సమాజంలోని ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10% రిజర్వేషన్లు ప్రవేశపెట్టినప్పుడు సమాజంలోని ఏ వర్గానికి ఒత్తిడి కలిగించకుండా మన ప్రభుత్వం మన సమాజం మరియు దేశం యొక్క విలువలు మరియు ప్రయోజనాలకు కట్టుబడి ఉందని ఇది నిరూపిస్తుంది.



## వడగాలులు ఎక్కువ, వర్షపాతం కూడా ఎక్కువే

తెలంగాణ ముచ్చట్లు:

మే అనగానే ప్రజలకు ఎండల దడ మొదలవుతుంది. ఈ నెలలో ఎండలు, వడగాలుల ధాటికి జనం వణికిపోతుంటారు. ఈ క్రమంలోనే భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అప్డేట్ విడుదల చేసింది. ఈసారి మే నెలలో భారతదేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువే ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది. అయితే నెలలోని 31 రోజుల్లో అడపాదడపా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసి వేడి తీవ్రతను కొంతమేర తగ్గిస్తాయని ఊరటనిచ్చే కబురును కూడా ఐఎండీ వినిపించింది. అప్పుడప్పుడు కురవనున్న వర్షాలు గత సంవత్సరం మే తో పోల్చుకుంటే ఈసారి ఉష్ణోగ్రతలు తీవ్ర స్థాయికి చేరకుండా నిరోధిస్తాయని పేర్కొంది.

ఎండాకాలం సీజన్‌లోని ప్రతీ నెలలో సగటున రెండు నుంచి మూడు రోజుల పాటు వడగాలులు వీయడం అనేది సాధారణ అంశం. ఈసారి మే నెలలో వడగాలులు కాస్త ఎక్కువ రోజుల పాటు కొనసాగుతాయని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మోహపాత్ర తెలిపారు. ఈసారి రాజస్థాన్, హరియాణా, పంజాబ్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బిహార్, ఝార్ఖండ్, బంగాల్ వంటి రాష్ట్రాల్లో వడగాలులు సాధారణం కంటే ఒకటి నుంచి నాలుగు రోజులు ఎక్కువగా కొనసాగుతాయన్నారు. గుజరాత్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఉత్తర కర్ణాటకలోని కొన్ని ప్రాంతాలలోనూ వడగాలులు సాధారణం కంటే ఎక్కువ రోజులే కొనసాగుతాయని ఆయన అంచనా వేశారు. నైరుతి ద్వీపకల్ప భారతదేశం మినహా దేశంలోని వివిధ ప్రాంతాలలో మే నెలలో సగటున ఒకటి నుంచి మూడు రోజుల పాటు వడగాలులు వీస్తాయన్నారు.

మే నెలలో వాయవ్య, మధ్య, ఈశాన్య భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు మినహా దేశంలోని చాలా ప్రాంతాలలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతమే నమోదయ్యే అవకాశం ఉందని మోహపాత్ర చెప్పారు. 'ఉత్తర భారతదేశంలో వర్షపాతం సాధారణం కంటే ఎక్కువగా కురిసే అవకాశం ఉంది. అక్కడ దీర్ఘకాలిక వర్షపాత సగటు 64.1 మి.మీ. ఇందులో 109 శాతం కంటే ఎక్కువగా వర్షపాతం నమోదు కావచ్చు' అని ఆయన వెల్లడించారు.

ఈ సంవత్సరం ఏప్రిల్ నెలలో మన దేశంలోని వివిధ రాష్ట్రాల్లో సగటున 72 దినాల పాటు వడగాలులు వీచాయని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మోహపాత్ర తెలిపారు. ఈసారి ఏప్రిల్‌లో రాజస్థాన్, గుజరాత్‌లలో సాధారణం కంటే ఎక్కువగా వడగాలులు వీచాయి. ఆ రాష్ట్రాల్లో సగటున 6 నుంచి 11 రోజుల పాటు వడగాలులు వీచినట్లు ఐఎండీ తెలిపింది. తూర్పు మధ్య ప్రదేశ్, విదర్భ ప్రాంతాల్లో సగటున 4 నుంచి 6 రోజుల పాటు వడగాలులు వీచినట్లు గుర్తించింది. ఏప్రిల్‌లో తూర్పుమధ్య భారతదేశం, మహారాష్ట్ర, ఉత్తర ద్వీపకల్ప భారతదేశంలోని పరిసర ప్రాంతాలలో ఒకటి నుంచి మూడు రోజుల పాటు వడగాలులు వీచాయి.



## ఫాం హౌస్‌లో పడుకుని ప్రతిపక్ష హక్కు ఎట్లా?

(మొదటి పేజీ తరువాయి)

పదేళ్లు తామే అధికారంలో ఉంటామని రేవంత్ ధీమా వ్యక్తం చేసారు.


మాజీ సీఎం కేసీఆర్ లక్ష్యంగా సీఎం రేవంత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేసారు. ఫాం హౌస్ లో పడుకునే మీకు ప్రతిపక్ష హోదా ఎందుకని ప్రశ్నించారు. కేసీఆర్ తెచ్చిన పథకాల్లో ఏ పథకం ఆగిందో చెప్పాలంటూ సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఉచిత కరెంట్, కళ్యాణలక్ష్మి, ఫీజు రీయింబ ర్స్‌మెంట్ సహా ఎన్నో పథకాలు అమలవుతున్నాయి... ఈ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు కేసీఆర్‌కు కనిపించటం లేదా అంటూ సీరియస్ అయ్యారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఎన్ని బస్సులు కావాలంటే.. అన్ని బస్సులు ఇవ్వాలని చెప్పామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం కూడా బలంగా ఉండాలని సీఎం అభిప్రాయపడ్డారు.

బీఆర్ఎస్ సభలో ప్రభుత్వానికి ఏవైనా సూచనలు.. సలహాలు ఇస్తారని భావించామని.. కానీ అలా జరగలేదని రేవంత్ చెప్పుకొచ్చారు. ప్రజాసమస్యలను పట్టించుకోకుండా.. ఫాంహౌస్‌లో ఉంటూ.. రాబోయే తరాలకు ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారని కేసీఆర్‌ను సీఎం ప్రశ్నించారు. వచ్చే పదేళ్లు తామే అధికారంలో ఉంటామని.. కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితం అవుతారన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను.. గత పదేళ్లు కోతుల గుంపునకు ఇచ్చినట్లైందంటూ సీఎం తీవ్ర విమ ర్శలు చేశారు. ఏ అంశంపై నైనా చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్న సీఎం రేవంత్.. కేసీఆర్ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. తమ నిర్ణయాల్లో ఏవైనా లోపాలుంటే చెప్పాలన్నారు. పదేళ్లు మీరు దోచుకుని.. మమ్మల్ని తెలంగాణ ద్రోహులు అంటారా అంటూ ఫైర్ అయ్యారు. తెలంగాణను ఇచ్చింది కాంగ్రెస్ కాదా అని ప్రశ్నించారు. కేసీఆర్ ఉద్యోగం ప్రజలు ఎందుకు పీకేశారో అర్థం కాలేదా అంటూ రేవంత్ మండిపడ్డారు.

## డూప్లికేట్ గాంధీల కాలంలో కులగణన ఎందుకు చేయలేదు ?

- కులగణనపై 50 ఏళ్ల పాలనలో ఒక్క అడుగూ వేయని కాంగ్రెస్ ఇప్పుడు క్రెడిట్ తీసుకోవడం దుర్మార్గం
- కులాల వారీగా స్పష్టమైన గణాంకాలు వెలుగులోకి వస్తాయి
- రాజకీయాలకు అతీతంగా అందరూ కులగణనకు సహకరించాలి: బండి సంజయ్ పిలుపు

**తెలంగాణ ముచ్చట్లు:** జాతీయ కులగణనకి కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకి అంటూ కేంద్ర హెంశాఖ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. కులగణన చేపట్టాలనే కేంద్ర ప్రభుత్వం కేబినెట్ లో తీసుకున్న నిర్ణయం తమ ఘనతే అని చెప్పుకుంటున్న కాంగ్రెస్‌కు బండి సంజయ్ చురకలంటించారు. 'కాంగ్రెస్ 50 ఏళ్ల పాలనలో జనాభా లెక్కల్లో కుల గణనను చేర్చకపోవడమే నిదర్శనం. కులగణన చేయాలంటూ అన్ని పార్టీలు కోరినా పట్టించుకోని దుర్మార్గపు పార్టీ కాంగ్రెస్సే. మోదీ సర్కార్ నిర్ణయం కాంగ్రెస్ ఘనతేనని చెప్పడం సిగ్గుచేటు. అదే నిజమైతే డూప్లికేట్ గాంధీల ఏలుబడిలో కుల గణన ఎందుకు చేయలేదో సమాధానం చెప్పాలి. దేశవ్యాప్త కులగణన మోదీ సర్కార్ ఘనతే. రాష్ట్ర ప్రభుత్వ కులగణన సర్వే అంతా తప్పుల తడకే. కేసీఆర్ సమగ్ర సర్వేకు, రేవంత్ సర్కార్ సర్వేకు పొంతన లేకపోవడమే నిదర్శనం. కేంద్ర కులగణన అత్యంత శాస్త్రీయమైది. కులాల వారీగా జనాభా ఎంతో తేలిపోతోంది. జనాభా ఆధారంగా రిజర్వేషన్లలో న్యాయం జరుగుతుంది. రాజకీయాలకు అతీతంగా అందరూ సహకరించండి' అని బండి సంజయ్ కోరారు.





## హైదరాబాద్ పోలీస్ శాఖలో పెద్ద ఎత్తున మార్పులు

తెలంగాణ ముచ్చట్లు:

హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పాలనా సౌలభ్యం, ప్రజలకు సులువుగా అర్థమయ్యేందుకు వీలుగా కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. పలు పోలీస్ స్టేషన్ల పేర్లను మార్చడంతో పాటు, కొత్తగా ఒక పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ఇదే సమయంలో, కమిషనరేట్ వ్యాప్తంగా పెద్ద ఎత్తున సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను (సీఐలను) బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

నగరంలోని ప్రఖ్యాత ప్రాంతాల పేర్లను ప్రతిబింబించేలా కొన్ని పోలీస్ స్టేషన్లు, డివిజన్ల పేర్లను మార్చినట్లు సీపీ సీవీ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. దీని ప్రకారం, ఇప్పటివరకు సచివాలయం పోలీస్ స్టేషన్‌గా ఉన్న పేరును 'లేక్ పోలీస్ స్టేషన్'గా మార్చారు. అదేవిధంగా, హుమాయున్‌నగర్ పోలీస్ స్టేషన్‌ను 'మెహదీపట్నం పోలీస్ స్టేషన్'గా, షాహినాయత్‌గంజ్ పోలీస్ స్టేషన్‌ను 'గోషామహల్ పోలీస్ స్టేషన్'గా మారుస్తున్నట్లు ఆయన వెల్లడించారు. వీటితో పాటు, టోలిచౌకి ప్రాంతంలో 72వ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌ను కొత్తగా ఏర్పాటు చేసినట్లు సీపీ పేర్కొన్నారు.

**35 ఏళ్ల తర్వాత పునర్వ్యవస్థీకరణ**

సుమారు 35 సంవత్సరాల తర్వాత హైదరాబాద్ కమిషనరేట్‌లో పోలీస్ స్టేషన్ల పునర్వ్యవస్థీకరణ చేపట్టినట్లు సీవీ ఆనంద్ తెలిపారు. ఇప్పటివరకు నగరంలో 71 లా అండ్ ఆర్డర్, 31 ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు ఉన్నాయని ఆయన వివరించారు. గత రెండేళ్లుగా పోలీస్ స్టేషన్ల హద్దుల విషయంలో కొన్ని సమస్యలు, లా అండ్ ఆర్డర్ మరియు ట్రాఫిక్ ఠాణాలపై ప్రజల్లో గందరగోళం నెలకొన్నాయని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో సమగ్ర నివేదికను ప్రభుత్వానికి పంపించగా, మార్పులకు ఆమోదం లభించిందని తెలిపారు. పోలీస్ స్టేషన్ల పూర్తి వివరాలు, వాటి పరిధిని హైదరాబాద్ సిటీ పోలీస్ అధికారిక వెబ్‌సైట్‌లో త్వరలో అందుబాటులో ఉంచుతామని సీపీ స్పష్టం చేశారు.

**146 మంది సీఐల బదిలీ**

హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో భారీ పరిపాలనా ప్రక్షాళన జరిగింది. మొత్తం 146 మంది సీఐలను బదిలీ చేస్తూ కమిషనర్ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ విభాగాలతో పాటు ఇతర విభాగాల్లో పనిచేస్తున్న సీఐలు ఈ బదిలీల జాబితాలో ఉన్నారు. కమిషనరేట్ పరిధిలో పాలనను మరింత మెరుగుపరిచే చర్యల్లో భాగంగా ఈ బదిలీలు చేపట్టినట్లు తెలుస్తోంది.

## ఈ ఏడాదికి విద్యుత్ ఛార్జీల పెంపు లేదు: ఈఆర్‌సీ

తెలంగాణ ముచ్చట్లు:

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (202526)లో విద్యుత్తు ఛార్జీల పెంపు లేదని, యథాతథంగా పాత పద్ధతిలోనే కరెంటు వసూలు చేయాలని డిస్కంలను రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ) ఆదేశించింది. ఈమేరకు కరెంటు ఛార్జీల టారిఫ్ ఉత్తర్వును మంగళవారం మండలి కార్యాలయంలో ఎలెక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ డి.నాగార్జున్ విడుదల చేశారు. ఈ ఉత్తర్వు మే 1(గురువారం) నుంచి అమల్లోకి వస్తుందని వెల్లడించారు. రాష్ట్రంలోని రెండు డిస్కంలు, రాజన్న సిరిసిల్లలోని సెస్‌తో కలిపి మొత్తం మూడు విద్యుత్ సంస్థల ఆర్థికలోటు రూ.13,499.41 కోట్లు ఉంటుందని ఈఆర్‌సీ తెలిపింది. ఈ ఏడాదికి ఆర్థికలోటు దాదాపుగా రూ.20,151 కోట్లు ఉంటుందని గత సంవత్సరం నవంబరులో డిస్కంలు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరపిన ఈఆర్‌సీ అంతకు రూ.6,652 కోట్లు తక్కువగా అంటే రూ.13,499.41 కోట్లు ఉంటుందని వెల్లడైనట్లు ఛైర్మన్ తెలిపారు. వ్యవసాయానికి విద్యుత్తు వినియోగం ఎక్కువగా అవసరం ఉంటుందని భావించి డిస్కంలు ఎక్కువ లోటు చూపాయని, కానీ అంత ఉండదని ఈఆర్‌సీ విచారణలో నిర్ధారించినట్లు ఛైర్మన్ వివరించారు.




మొత్తం ఆర్థికలోటు తీర్చడానికి రూ.13,499.41 కోట్లను రాయితీగా విడుదల చేస్తామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాతపూర్వకంగా హామీ ఇచ్చినందున ఛార్జీల పెంపునకు అనుమతించడం లేదని జస్టిస్ నాగార్జున్ వివరించారు. గృహ వినియోగ కరెంటు ఛార్జీల్లో రాయితీలకు రూ.1,896.81 కోట్లు, వ్యవసాయానికి ఉచితంగా ఇస్తున్నందుకు మరో రూ.11,602.60 కోట్లు ఇస్తామని ప్రభుత్వం డిస్కంలకు వివరించింది. గత ఆర్థిక సంవత్సరం (202425)లో ఇచ్చిన రాయితీ సొమ్ముకన్నా ఇది 1999.89 కోట్లు (17.4%) ఎక్కువ. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న గృహజ్యోతి పథకంలో 50,52,167 ఇళ్లకు నెలకు 200 యూనిట్ల వరకు ఇస్తున్న ఉచిత కరెంటు కోసం ఈ ఏడాది సర్కారు రూ.1,922 కోట్లను చెల్లించనుంది. విద్యుత్ వాహనాల (ఈవీ) ఛార్జింగ్ స్టేషన్ కాంట్రాక్టులోడు పరిమితి ఇప్పటివరకు 56 కిలోవాట్లు ఉండగా దానిని 150 కిలోవాట్లకు పెంచడానికి ఎలెక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ అనుమతించింది. గ్రిడ్ సపోర్టు ఫీజు ప్రస్తుతం నెలకు కిలోవాట్‌కు రూ.18.48 ఉండగా మే 1 నుంచి రూ.20.04కి పెంచుకోవడానికి అనుమతిని ఇచ్చింది. ఓపెన్ యాక్సెస్ వినియోగదారులు 24 గంటల ముందు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా కాంట్రాక్టు డిమాండుకన్నా అదనంగా కరెంటు వాడుకుంటే 10 శాతం అదనపు ఛార్జీలను వసూలు చేస్తారు.

కరెంటు ప్రమాదాల్లో ఎక్కువగా యువత ప్రాణాలు కోల్పోతున్నారని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని డిస్కంలకు సూచించినట్లు జస్టిస్ నాగార్జున్ తెలిపారు. యాదాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రం నిర్మాణం 2026 జనవరి నాటికి మొత్తంగా పూర్తవుతుందని, అప్పటివరకూ పూర్తిగా 4 వేల మెగావాట్ల కరెంటు రాదని, దానిని మాత్రం ప్రస్తుతం పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. పగటిపూట సోలార్ కరెంటు ఉత్పత్తి ఎక్కువగా ఉంటున్నందున, రాష్ట్రంలో మిగులు విద్యుత్ ఉన్నట్లు కనిపిస్తోందని, కానీ రాత్రి సమయంలో థర్మల్ విద్యుత్ ఎక్కువగా అవసరమని దీంతో డిస్కంలు బయట కొనాల్సి వస్తుందని తెలిపారు. ఇదే పరిస్థితి కొనసాగితే 2030 నాటికి రాష్ట్రంలో విద్యుత్తు కొరత ఏర్పడుతుందన్నారు. దాన్ని అధిగమించడానికి కొత్త పవర్ ప్లాంట్‌లతో కొనుగోలు ఒప్పందాలు చేసుకోవాలన్నారు.

## జాతీయ భద్రతా సలహా బోర్డు పునర్వ్యవస్థీకరణ

(మొదటి పేజీ తరువాయి)

ఈ నియామకాల ద్వారా వివిధ రంగాల్లో అనుభవజ్ఞులైన నిపుణులను భద్రతా సలహా బోర్డులోకి తీసుకువచ్చినట్లయింది. ఇటీవల పహల్గామ్ ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ దాడికి ప్రతిస్పందన విషయంలో పూర్తి స్వేచ్ఛను భద్రతా బలగాలకే ఇస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించాలనేదే జాతీయ సంకల్పమని, దానిని నెరవేర్చేందుకు ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉందని



ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భద్రతా యంత్రాంగానికి మరింత పదును పెట్టే చర్యల్లో భాగంగానే ఎన్ఎస్ఏబీ పునర్వ్యవస్థీకరణ జరిగిందని తెలుస్తోంది.

## ఆర్టీసీ భవిష్యత్ కోసం సమ్మెపై పునరాలోచించండి

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటివరకు శాఖ మంత్రిగా తనను కార్మిక నేతలు కలవలేదన్నారు. డైరెక్ట్‌గా లేబర్ కమిషన్‌ను కలిసి నోటీస్ అందజేశారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యమకారుడిగా తనకు ఆర్టీసీతో ప్రత్యేక అనుబంధం ఉందని, కార్మిక సంఘాల నేతలతో సమాలోచనలు చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు.

పదేళ్లు ఆర్టీసీ ఆగమైందని తాము అధికారంలోకి వచ్చిన తరవాత అన్ని బకాయిలు విడుదల చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఆర్టీసీ సంస్థ ప్రస్తుతం నష్టాల నుంచి లాభాల బాటలో నడుస్తుందని సమ్మె చేస్తే తిరిగి నష్టాల్లోకి వెళుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రవాణా శాఖను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నడుపుతాయని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.



దేశంలో పరివాహన్ సారథి అనే పోర్టల్‌ను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని, దేశంలో ఇప్పటికే 28 రాష్ట్రాలు సారథి పోర్టల్‌ను అమలు చేస్తున్నాయన్నారు. సారథి పోర్టల్ గురించి తెలుసుకోండి : ప్రజా పాలన ప్రభుత్వం వచ్చిన తరువాత సారథి పోర్టల్‌పై నిర్ణయం తీసుకొని ప్రారంభించుకున్నామని మంత్రి పొన్నం స్పష్టం చేశారు.. దేశ వ్యాప్తంగా రవాణా పరమైన మార్పులు నిర్ణయాలు, వాహనాల సమాచారం ,రవాణాశాఖకు సంబంధించిన సమగ్ర సమాచారం సారథి పోర్టల్‌తో తెలుసుకునే అవకాశం ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

ప్రతి రోజు కనీసం 20 రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వందలాది మంది ప్రమాదాల్లో వైకల్యం పొందుతున్నారని ఎదుటివారి నిర్లక్ష్యం వల్ల కొంతమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. అందుకే రోడ్డు మాసోత్సవాలు ద్వారా రోడ్డు భద్రత కార్యక్రమాలు చేపట్టి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించి ప్రాణాలు కాపాడేలా స్కూల్ స్థాయి నుండి కార్యక్రమాలు చేపట్టాం అన్నారు. రాష్ట్రాన్ని రోడ్డు ప్రమాదాల రహిత తెలంగాణగా మారుస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

# రెండు రోజుల్లో వరి ధాన్యం కొనుగోళ్ల సమస్యను పరిష్కరించాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి తో ప్రత్యేక సమావేశంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**
వనపర్తి నియోజకవర్గ పరిధిలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో నెలకొన్న సమస్యలను రెండు రోజుల్లో పూర్తిగా పరిష్కరించాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.
బుధవారం వనపర్తి కలెక్టర్ ఛాంబర్ లో అధికారులతో ఆయన ప్రత్యేకంగా సమావేశం అయ్యారు.కొనుగోలు చేసిన ధాన్యాన్ని గోదాములలో దింపేందుకు ఇబ్బందులు ఉన్నాయంటూ రైతులు తమ దృష్టికి తీసుకు వస్తున్నార ని లారీల సమస్యను, గోదాముల వద్ద నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన సూచించారు.ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం విక్రయంలో రైతులకు ఇలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్ కు సూచించారు.ఈ కార్యక్రమంలో మహబూబ్నగర్ జిల్లా డిసిసిబి అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా సివిల్ సప్లై అధికారులు, పాల్గొన్నారు.





# మే డే వాల్ పోస్టర్ విడుదల

- ఘట్టమ్మ జిపి మండల అధ్యక్షురాలు పెద్దమందడి

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**
వనపర్తి జిల్లా, పెద్దమందడి మండల కేంద్రంలో మే 1 న, 139 వ అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే డే ను, ఒక పండుగలా కాకుండా దీక్ష దినంగా జరుపుకోవాలని పెద్దమందడి జీపీ కార్మికుల అధ్యక్షురాలు ఘట్టమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మే డే వాల్ పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మేడే పోరాట స్ఫూర్తితో పెట్టుబడిదారుల కార్పొరేట్ మతోన్మాద దోపిడీదారులు అణిచివేతలు, వివేక్షకులకు వ్యతిరేకంగా పోరాడుతూ, వర్గ ఐక్యత సాధించి వర్గ పోరాటాలను ఉధృతం చేయాలని, కార్మిక వర్గ ప్రతిఘటన వల్ల నే ఎనిమిది గంటల పని దినం చట్టం చేయబడిందన్నారు. 139 సంవత్సరాల క్రితం 10 గంటల నుండి 16 గంటలు వరకు పని దినముంటే, దాన్ని తగ్గించుకునేందుకు జరిగిన పోరాటంలో ప్రాణాలు సైతం త్యాగం చేశారు ఆనాటి మన పోరాట యోధులు అని అన్నారు. మేడే 1 నా, జరిగే జెండా కార్యక్రమంలో, పెద్దమందడి మండల పరిధిలోని అన్ని గ్రామాల కార్మికులు, జెండావిష్కరణలో పాలుపంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో, పెద్దమందడి మండల జిపి కార్మికుల విభాగం అధ్యక్షురాలు ఘట్టమ్మ, వెంకటమ్మ, సుందరయ్య, ఆంజనేయులు, కురుమన్న, బి. నిరంజన్, వాసన్న, తదితరులు పాల్గొన్నారు.


# క్రికెట్ క్రీడా పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**
పెద్దమందడి మండలం మనిగిళ్ళ గ్రామంలో గ్రామదేవత పెద్దమ్మ తల్లి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ క్రీడా పోటీలను బుధవారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీలలో గెలుపు, ఓటములు సహజమని యువకులు క్రీడా స్ఫూర్తితో ఆడాలని ఎమ్మెల్యే సూచించారు.కార్యక్రమంలో మణిగిల్ల మాజీ సర్పంచ్ సరితా తిరుపతిరెడ్డి, వెంకటయ్య, వెంకటేష్, నరసింహారెడ్డి, క్రీడాకారులు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# క్రమశిక్షణకు నిబద్ధతకు మారుపేరు మోరబోయిన వెంకటేశ్వర్లు యాదవ్

**సత్తుపల్లి, తెలంగాణ ముచ్చట్లు:**
సత్తుపల్లి పట్టణ అగ్నిమాపక కేంద్రంలో లీడింగ్ ఫైర్ మాన్ గా 38 సంవత్సరాలు క్రమశిక్షణగా పనిచేసిన మోరబోయిన వెంకటేశ్వర్లు యాదవ్ పదవీ విరమణ వేడుక సత్తుపల్లిలోని ఫైర్ స్టేషన్ నందు బుదవారం జరిగింది. ఈ వేడుకకు హాజరైన తెలంగాణ యాదవ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు మాజీ డిసిసి చైర్మన్ కూరాకుల నాగభూషణం యాదవ్, వైరా మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ ఖమ్మం జిల్లా యాదవ సంఘం కార్యదర్శి గుమ్మా రోశయ్య యాదవ్ లు హాజరై మాట్లాడుతూ.. అగ్నిమాపక శాఖలో విధులు నిర్వహిస్తూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా సేవలందించి ఎలాంటి రిమార్కు లేకుండా ఆదర్శంగా 37 సంవత్సరాల ఐదు నెలల ఐదు రోజులపాటు పనిచేసి బుధవారం రిటైర్మెంట్ కావడం శుభపరిణామన్నారు. యాదవ కులంలో పుట్టి ఇంత క్రమశిక్షణగా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవడం యాదవ జాతికే ఆదర్శం అని కొనియాడారు. మోరబోయిన వెంకటేశ్వర్లు ఉద్యోగానికి మాత్రమే రిటైర్మెంట్ తప్ప యాదవ సమాజానికి సేవ చేయడంలో రిటైర్మెంట్ తీసుకోకుండా పనిచేయాలని కోరారు. వారి కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు. యాదవ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భారీ మల్సూర్ యాదవ్ , జిల్లా కన్వీనర్ కోడి లింగ యాదవ్ , యూత్ జిల్లా అధ్యక్షులు జడ మల్లేష్ యాదవ్ , రాష్ట్ర ఉపాధ్యక్షులు జంగా సత్యనారాయణ యాదవ్ , సత్తుపల్లి నియోజకవర్గ అధ్యక్షులు డాక్టర్ పెద్దిరాజు యాదవ్, జిల్లా నాయకులు కర్రీ వెంకటేశ్వర్లు యాదవ్, కాలంగి గురవయ్య యాదవ్, సత్తుపల్లి పట్టణ కార్యదర్శి జోనబోయిన రామకృష్ణ యాదవ్, సత్తుపల్లి రూరల్ మండలం అధ్యక్షులు రాగం సత్యనారాయణ యాదవ్, జిల్లా నాయకులు వాకదాని రామకృష్ణ యాదవ్, పట్టణ నాయకులు దొడ్డాకుల గోపాలరావు యాదవ్, గుంట్రు రామకృష్ణ యాదవ్, సత్తుపల్లి మాజీ మున్సిపల్ వార్డ్ కౌన్సిలర్ దూదిపాల రాంబాబు యాదవ్, సొసైటీ మాజీ చైర్మన్ కాలసాని గజేంద్రరావు యాదవ్, సత్తుపల్లి మండల నాయకులు తొర్లపాటి నాగేశ్వరరావు యాదవ్, గంగుల మోహన్ రావు యాదవ్ , రాచూరి శ్రీనివాస రావు యాదవ్, కోమటి జమలయ్య యాదవ్, మహిళా నాయకురాలు సుధ , మోర ప్రసాద్ తదితరులు పాల్గొని వారి కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు.



# ఎస్సెస్సి ఫలితాల్లో సత్తా చాటిన తాటికాయల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

**మండలానికి గర్వకారణంగా నిలిచిన తాటికాయల జెడ్పిహెచ్ఎస్**

**ధర్మసాగర్,తెలంగాణ ముచ్చట్లు:**
తాటికాయల గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ (జెడ్పిహెచ్ఎస్) విద్యార్థులు ఈ సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో అసాధారణ ప్రతిభ కనబరిచి మండల స్థాయిలో ప్రశంసలు అందుకున్నారు. 2025 మార్చిలో నిర్వహించిన పదో తరగతి పరీక్షలు బుధవారం విడుదలవగా, 21 మంది పరీక్ష రాసిన విద్యార్థుల్లో 20 మంది ఉత్తీర్ణత సాధించి,విజయదుంధుబి మోగించారు.
అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల్లో గాదె అమ్ములు 529 మార్కులతో మొదటి స్థానం, నీల అక్షయ 528 మార్కులతో రెండో స్థానం, పిట్టల ఐశ్వర్య 512 మార్కులతో మూడో స్థానం, బక్కతట్ల సాత్విక 504 మార్కులతో నాలుగో స్థానం సాధించారు. వీరంతా పేదతనాన్ని దాటి కృషి ద్వారా విజయం సాధించి ప్రభుత్వ పాఠశాలలకు మోడల్స్‌గా నిలిచారు.
ఈ సందర్భంగా ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు సత్తయ్య విద్యార్థులను స్వయంగా అభినందించారు. "మా విద్యార్థుల విజయమే మా టీచర్ల కృషికి నిదర్శనం. ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతూ వారిని ఈ స్థాయికి తీసుకువచ్చారు" అని పేర్కొన్నారు.
విద్యార్థుల విజయంలో భాగమైన ఉపాధ్యాయ బృందాన్ని గ్రామస్థులు, తల్లిదండ్రులు ప్రశంసిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివినప్పటికీ మంచి మార్కులు సాధించగలమన్న నమ్మకాన్ని ఈ ఫలితాలు చాటి చెప్పాయి.
ఈ విజయంతో మరిన్ని కుటుంబాలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ముందుకు రావాలని, ప్రభుత్వ విద్య వ్యవస్థపై విశ్వాసం పెంచాలని ఉపాధ్యాయ బృందం కోరుతోంది.


గాదె అమ్ములు
529/600


నీల అక్షయ
528/600


పిట్టల ఐశ్వర్య
512/600


బక్కతట్ల సాత్విక
504/600

### ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు



"మా పాఠశాల నుంచి ఈ సంవత్సరం పదో తరగతి పరీక్షలు రాసిన 21 మంది విద్యార్థుల్లో 20 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో గాదె అమ్ములు 529, నీల అక్షయ 528, పిట్టల ఐశ్వర్య 512, బక్కతట్ల సాత్విక 504 మార్కులు సాధించడం గర్వకారణం. ఇది మా టీచర్ల కట్టుబాటుతో, విద్యార్థులు శ్రమతో సాధించిన ఫలితం."
"ప్రభుత్వ పాఠశాలల్లోనూ నాణ్యమైన విద్య అందుతుంది. తక్కువ ఖర్చుతో, ఎలాంటి శిక్షణా కేంద్రాల అవసరం లేకుండానే గొప్ప ఫలితాలు సాధించవచ్చు. ఈ విజయం తల్లిదండ్రులకు ఒక సందేశం – తమ పిల్లలను ధైర్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి. మేము సంపూర్ణ నిబద్ధతతో వారిని ఉన్నతస్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తాము"
– తాటికాయల జెడ్పిహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు సత్తయ్య

# విశ్వశాంతి లో 67శాతం మందికి 500 పైగా మార్కులు

- హర్షియా కు 569 మార్కులు.
- ప్రతి ముగ్గురిలో ఇద్దరికీ 500 పైగా మార్కులు.

**సత్తుపల్లి, తెలంగాణ ముచ్చట్లు:**
పదవ తరగతి ఫలితాల్లో సత్తుపల్లి పట్టణంలోనే అత్యధికంగా 65 శాతం మంది విశ్వశాంతి విద్యార్థులు 600కు గాను 500 పైగా మార్కులు సాధించారు. బుధవారం విడుదలైన ఎస్ఎస్సి ఫలితాలలో స్థానిక విశ్వశాంతి విద్యాలయానికి చెందిన ఎండి .హర్షియా 569/600 మార్కులు సాధించింది. మొత్తం 18 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా వారిలో 12 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారు. వారిలో గీతాశ్రీ 558, అపర్ణ 556, యోచిత 550, కృష్ణప్రియ 547, గాయత్రీ గీతాంజలి 541, వర్షిత్ 541, లక్ష్మీ ప్రసన్న 538, సాయి జాగృతి 532, మహంత్ 531, రామ్ చరణ్ 524, శ్రీవల్లి 508, అక్షయ 498, గగన శ్రీ 481, మంజూష 476, ముజీబ్ 470, రామకృష్ణ వేణి 467, జగదీష్ 458 మార్కులు సాధించారు.



# సిఐటియు పోరాట ఫలితమే అంగన్వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు

**వనపర్తి,తెలంగాణ ముచ్చట్లు :**
వనపర్తి ఐసిడిఎస్ డైరెక్టర్ కార్యాలయంలో బుధవారం డైరెక్టర్ కాంతివేస్లీ సంబంధిత అధికారులు అంగన్వాడీ యూనియన్లతో జాయింట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి సిఐటియు యూనియన్ నుండి రాష్ట్ర అధ్యక్షురాలు కే.సునీత ప్రధాన కార్యదర్శి పి. జయలక్ష్మి, ఉపాధ్యక్షురాలు కే.సమ్మక్క పాల్గొన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్ గారు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు మే నెలంతా సెలవులు ఇస్తున్నామని తెలియజేశారు. ఇతర సేవలు అందించటం కోసం అంగన్వాడి ఉద్యోగులందరూ కృషి చేయాలని అన్నారు. ఈ నిర్ణయం వెలువడిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి సిఐటియు తరఫున కృతజ్ఞతలు తెలియజేశాము. అంగన్వాడీ టీచర్స్ ,హెల్పర్స్ అంగన్వాడీ కార్యకర్తలు గా 50 సంవత్సరాలనుండి పనిచేస్తున్నారు.మే నెలలో సెలవులు కావాలని ఎన్నో ధర్నాలు చేశాము. కానీ ప్రభుత్వంలు చే లించలేదు.... కానీ కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క మేడం వచ్చాక అంగన్వాడీ స్కూల్ కి ఒంటి పూట బండి, మరియు ఎండల తీవ్రత ఎక్కువ గా ఉన్ననందున్న అంగన్వాడీ కేంద్రం కి వచ్చే 35 పిల్లలను దృష్టిలో పెట్టుకొని సీతక్క మేడం మే నెల మొత్తం అంగన్వాడీ టీచర్స్ కి ఆయకి సెలవులు ఇచ్చిందుకు సీతక్క మేడం కి జిల్లా అంగన్వాడీ టీచర్స్ ,హెల్పర్స్ తరుపున ప్రత్యక ధన్యవాదములు అలాగే, మాకోసం మా ముందు ఉండి మాకు అండగా నిలిచినా అంగన్వాడీ సిఐటి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి మేడం కి మరియు జిల్లా నాయకులకి ప్రత్యక ధన్యవాదములు తెలియజేస్తున్నాం. అంగన్వాడీ టీచర్స్ ,హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నారాయణమ్మ,జిల్లా నాయకులు రమాదేవి, వేంకటేశ్వరమ్మ, రాఘవేంద్రమ్మ, మరోని, శారద,లక్ష్మి, రాణి.మరియు టీచర్స్ ,హెల్పర్స్ తదితరులు పాల్గొన్నారు.

# జగత్ పల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో మెరిసిన సరస్వతి పుత్రికలు

- 10 తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు
- విద్యార్థులను అభినందించిన ఉపాధ్యాయులు, గ్రామస్తులు

**వనపర్తి ,తెలంగాణ ముచ్చట్లు:**
బుధవారం విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో మండల పరిధిలోని జగత్ పల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలలో మొత్తం 35 మంది విద్యార్థులు పరీక్షలు రాగా మొత్తానికి మొత్తం గా అందరూ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇందులో ముంత తిరుపతయ్య కూతురు భువనేశ్వరి





543 మార్కులు. గౌనికాడి బాలరాజు యాదవ్ కూతురు పల్లవి 522 మార్కులు. నరసింహ కూతురు నందిని 504 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి శ్రీనివాస్ రెడ్డి. సిబ్బంది గ్రామస్తులు విద్యార్థులను అభినందించారు..

## భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారమే మేడేకు సార్థకత

- రాష్ట్ర ప్రచార కార్యదర్శి నల్ల స్వామి డిమాండ్

**హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:**
ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రచార కార్యదర్శి నల్ల స్వామి రెండు తెలుగు రాష్ట్రాల కార్మిక సోదరులందరికీ మేడే శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ - 8 గంటల పని దినం సాధించడానికి కార్మికులు చేసిన త్యాగాల్ని గుర్తు చేశారు. ఎంతో మంది ప్రాణ త్యాగంతో సంపాదించుకున్న హక్కుల పట్ల ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.



**కార్మికుల ప్రధాన డిమాండ్లు:**
1.భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డుకు కార్మికులలోనుంచి చైర్మన్‌ను నియమించాలి.
2.సంక్షేమ పథకాలను ప్రైవేటు ఇన్స్యూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పే వ్యవహారాన్ని నిలిపివేసి టెండర్లు రద్దు చేయాలి.
3.కార్మికుల కార్డులు శాశ్వతంగా పనిచేసే విధంగా చేయాలి.
4.ప్రత్యేకంగా కార్మిక శాఖకు మంత్రిని నియమించాలి.
5.ప్రతి కార్మికుడికి 55 సంవత్సరాలు నిండగానే పెన్షన్ సౌకర్యం కల్పించాలి.
6.ప్రమాదవశాత్తు మరణించిన కార్మిక కుటుంబాలకు రూ.10 లక్షల భీమా సాయం ఇవ్వాలి.
7.ఉపాధి హామీ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా నియమించి బోర్డు నుండి తొలగించకుండా పరిరక్షించాలి.
1996లో వచ్చిన చట్టాన్ని పూర్తిగా అమలు చేయకపోవడం వల్ల కార్మిక లోకానికి తీరని అన్యాయం జరుగుతోందని నల్ల స్వామి పేర్కొన్నారు. మేడే పండుగ రోజున కార్మికుల సమస్యలకు న్యాయం జరగాలని కోరుకుంటున్నామని తెలిపారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

పెద్దమందడి మండలం అమ్మపల్లి గ్రామం సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి అన్నగారైన సర్వ రెడ్డి కుమార్తె వివాహానికి బుధవారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు .ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడి వివాహ వివరాలను తెలుసుకున్నారు.వధూవరులుకుటుంబ సభ్యులతో కలిసి ఫోటోలు దిగుతూ కాసేపు సందడి చేశారు. కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మాజీ జెడ్పిటిసి వెంకటస్వామి, మాజీ సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి, రమేష్ యాదవ్, మణిగిల్ల తిరుపతిరెడ్డి, బాలు, శ్రీనివాస్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి పొంగులేటి

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం జిల్లాలో బుధవారం పర్యటించారు. పర్యటనలో భాగంగా మధిర నియోజకవర్గం చింతకాని మండలం కొదుమూరులో జరిగిన కన్నేటి సురేష్ వివాహానికి, ఖమ్మం నియోజకవర్గం మేకల బిక్షమయ్య నగర్ లోని ఎంబి గార్డెన్స్ , పాలేరు నియోజకవర్గం వెంకటగిరి క్రాస్ రోడ్డులోని శ్రీ హర్ష కన్వెన్షన్, దానవాయిగూడెంలోని శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్, కస్నా తండాలో తెల్లబోయిన రత్నాకర్ వివాహ వేడుకకు, రెడ్డిపల్లిలోని అమ్మ ఫంక్షన్ హాల్లో జరిగిన ఓ వివాహ వేడుకకు అదేవిధంగా కూసుమంచి మండలం పాలేరు గ్రామంలో జరిగిన ఓ శుభకార్యానికి హాజరయ్యారు. పట్టు వస్త్రాలను కానుకగా సమర్పించారు.





## బాధిత కుటుంబాలను పరామర్శించిన కోరం కనకయ్య, మల్లి బాబు యాదవ్

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

కామేపల్లి మండలం పండితాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దినేని రమేష్ కుమారుడు డా. మద్దినేని పవన్ కృష్ణ గత సంవత్సరం ఇదే రోజున రోడ్డు ప్రమాదంలో మరణించారు. వారికి స్మృతిగా బుధవారం జరిగిన సంవత్సరం కార్యక్రమంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ పాల్గొని పవన్ కృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మరియు గరిడేపల్లి గ్రామానికి చెందిన బట్టు శ్రీను ఇటీవల గుండెపోటుతో అకస్మాత్తుగా మరణించారు. బుధవారం జరిగిన దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న వయసులో ప్రాణాలు కోల్పోయి ఆ కుటుంబాలకు తీరని లోటు మిగిల్చారని తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ పతే మహమ్మద్,గింజల నర్సిరెడ్డి, దమ్మాలపాటి సత్యం జన్నారపు లింగయ్య, నల్లపునేని వినోద రావు యలమద్ది నరసింహారావు వల్లం కొండ బ్రహ్మం, మాగం వెంకటేశ్వర్లు, గుజ్జర్లపూడి రాంబాబు మాలోత్ బావ్ సింగ్, గుజ్జర్లపూడి రాంబాబు, అంబడిపూడి వెంకటేశ్వర్లు పాటి చిన్న లక్ష్మయ్య, ధనియాకుల హనుమంతరావు, దొడ్డ వేణు, వెంకటేశ్వర్లు, అనురాధ, నరసింహారావు అప్పయ్య ఉపేందర్, బట్టు నాను బట్టు రమేష్, తుమ్మ భాస్కర్, గోపి రాణి రాజేష్ రాము తదితర బంధుమిత్రులు పాల్గొన్నారు

## పదవీ విరమణ పొందిన పోలీసు అధికారి సేవలకు అభినందన

- **సమాజాభివృద్ధిలో పాలు పంచుకుంటూ పోలీసుశాఖ ప్రతిష్ట పెంచాలని సూచన**
- **జిల్లా ఎస్పీ రావుల గిరిధర్**

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**



పదవి విరమణ అనంతరం విశ్రాంతి జీవితం ప్రశాంతంగా గడపాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు.బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ జిల్లా సాయుధ దళ కార్యాలయంలో కానిస్టేబుల్ నుండి ఏ,ఆర్ ఎస్సైగా 35 సంవత్సరాల పాటు విధులు నిర్వర్తించి పదవి విరమణ పొందుతున్న ఏ,ఆర్ ఎస్సై, ఎం, హేమాజీ దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి వారి సేవలను అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పదవీ విరమణ సమయంలో ప్రతి ఉద్యోగికి సంతోషం, బాధ రెండూ ఉంటాయన్నారు.

పదవీ విరమణ తర్వాత ఒక కొత్త జీవితం మొదలవుతుందని, ప్రతి ఒక్కరూ ఎదో ఒక వ్యాపకం పెట్టుకోవడం ద్వారా నచ్చిన రంగంలో ముందుకు సాగాలని సూచించారు. పదవీ విరమణ తర్వాత ఖాళీగా ఉంటే నిరుత్సాహం ఏర్పడుతుందని అలా కాకుండా సంతోషంగా కుటుంబంతో గడపాలని చెప్పారు. పదవీ విరమణ తర్వాత వచ్చే మొత్తాలను ప్రయోగాలు చేయకుండా ప్రణాళికాయుతంగా వినియోగించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరికీ ఉద్యోగ విరమణ తప్పదని అయితే అదే సమయంలో ఉద్యోగం చేస్తూనే తమ కుటుంబాలను సంతోషంగా ఉండేలా చేసుకున్న పోలీసు అధికారులు ఉద్యోగ విరమణ తర్వాత మరింత చురుకుగా జీవన విధానాన్ని మలచుకోవాలన్నారు. ఏ రంగంలోనైనా కష్టపడి పని చేసినప్పుడే అందుకు తగిన గుర్తింపుతో పాటు ఉన్నత స్థానాలకు చేరుకోగలమన్నారు. పోలీస్ ఉద్యోగం ద్వారా ఎన్నో రకాల త్యాగాలతో పాటు కుటుంబాలకు దూరంగా ఉంటూ ప్రజలకు సేవలందించడం గర్వకారణమన్నారు. న్యాయం కోసం ఎదురు చూసే బాధితులకు అండగా నిలిచే అవకాశం పోలీసు ఉద్యోగం ద్వారా లభిస్తుందని, పోలీస్ ఉద్యోగం ఎంతో ఉన్నతమైనదని చెప్పారు. పదవీ విరమణ అనంతరం ప్రభుత్వం నుంచి వారికి చెందాల్సిన జీపీఫ్ , ఇన్సూరెన్స్, భద్రత సాంక్షన్ బిల్స్ అందజేశారు. రావాల్సిన బెనిఫిట్స్ ను త్వరగా అందేలా చూడాలని సెక్షన్ అధికారులను ఆదేశించారు.ఈ పదవీ విరమణ కార్యక్రమంలో జిల్లా పోలీస్ కార్యాలయం ఏ ఓ, సునందన, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, రిజర్ ఇన్స్పెక్టర్, శ్రీనివాస్, రిజర్వేషన్ రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్, వినోద్, జిల్లా పోలీస్ కార్యాలయం సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

## శ్రీ కృష్ణ ప్రసాద్ స్కూల్ విద్యార్థులను అభినందించిన పోలీస్ కమిషనర్

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించిన శ్రీ కృష్ణప్రసాద్ మెమోరియల్ పోలీస్ సంక్షేమ ఉన్నత పాఠశాల విద్యార్థులను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో స్కూల్ చైర్ పర్సన్ నిష్ఠాశర్మ, స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ రాజు దిక్సూచి పాత్ర పోషించారని అన్నారు. మొత్తం 54 మంది విద్యార్థులలో ఉన్న ప్రతిభను గుర్తించి, మార్గనిర్దేశనం చేయడం ఉపాధ్యాయుల బాధ్యతగా తీసుకొని ఉత్తమ ఫలితాలకు కృషి చేశారని తద్వారా వందశాతం ఉత్తీర్ణత సాధించారని కొనియాడారు. ఈ విజయాన్ని సాధించిన ప్రతి విద్యార్థి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని, నిరంతరం చదువులో కొత్త నైపుణ్యాలను అభ్యసిస్తూ, వ్యక్తిత్వ వికాసాన్ని సాధిస్తూ,సమాజానికి ఆదర్శంగా నిలవాలని అన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను గుర్తించుకొని, వాటిని సాధించేందుకు గట్టి పట్టుదలతో ముందుకు సాగాలని అకాంక్షించారు.





# వక్ఫ్ సవరణ చట్టంను రద్దు చేయాలి..

- **ముస్లిం మైనారిటీల హక్కుల సాధన కోసం ఆర్ పి వి శాంతి ఉద్యమం..**
- **రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ కార్యక్రమానికి మద్దతుగా భారీ మోటార్ సైకిల్ ర్యాలీ..**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

కేంద్ర ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు వ్యతిరేకంగా వక్ఫ్ సవరణ చట్టం 2025 ను తీసుకు వచ్చి ముస్లింల హక్కులను కాల రాసిందనీ రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు (ఆర్ పి వి ఫౌండర్ ) సయ్యద్ సాధిక్ అలి ఆరోపించారు.. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆదేశానుసారం వారికి మద్దతుగా తన నిరసనను తమ సంస్థ చేపట్టిందని అన్నారు.. ముస్లిం మైనార్టీల పట్ల వివక్షతను చూపుతూ ముస్లిం మైనార్టీలను విభజించి పాలించే నైజాన్ని కేంద్ర ప్రభుత్వం అనేక ఏళ్లుగా ప్రదర్శిస్తూ వస్తుందని ఆయన ఆరోపించారు..ముస్లింల ఐక్యతను చాటుతూ.. మనమంతా హమ్ సబ్ ఏక్ హై... అంటూ.. ముస్లిం యువత పెద్ద ఎత్తున నినాదాలు చేశాయి..కేంద్రం తీసుకు వచ్చిన నల్ల చట్టాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ

ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ కార్యక్రమాలకు మద్దతుగా ఖమ్మం నగరంలోని జడ్పీ సెంటర్ ప్రాంతంలో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం సాక్షిగా శాంతి యుత నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగింది.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లి పాదాల కింద స్వర్గం ఉందని ఖురాన్ గ్రంథం చెబుతుందని, ఇంటికి దీపం ఇల్లాలు అనే నానుడి వున్న నేపధ్యంలో మాతృమూర్తికి సేవలు, సతీమణి పట్ల బాధ్యతలే తెలియని వారికి భారత దేశంలో ఉన్న 140 కోట్ల ప్రజల బాధలు ఎలా తెలుస్తాయని ఆయన ప్రశ్నించారు. మతేతర రాజ్యంలో మంటలు రేపుతూ.. ప్రతినిత్యం మతాల మధ్య చిచ్చు పెడుతూ.. విద్వేషాలను రెచ్చగొడుతూ కేంద్ర ప్రభుత్వం కక్షపూరిత ధోరణితో వ్యవహరిస్తూ.. రాజ్యాంగ వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చి ముస్లిం మైనార్టీల పట్ల చిన్నచూపు చూస్తూ.. పైశాచిక ఆనందం పొందుతుందన ఆయన ఆరోపించారు.. ముస్లిం మైనార్టీల హక్కుల సాధన కోసం, నల్ల చట్టాల రద్దు కోసం ఖమ్మం జిల్లా కేంద్రం నుంచి ప్రారంభమైన తమ శాంతి మార్గ నిరసనను రాబోవు రోజుల్లో దేశ రాజధాని హస్తినలో గల జంతర్ మంతర్ ప్రాంతాన్ని ముట్టడించే వరకు విశ్రమించేది లేదని ఆయన హెచ్చరించారు.... వక్ఫ్ భూములు ఏ కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలకు చెందినవి కావని, భారతదేశానికి స్వాతంత్రానికి ముందు ఆనాటి రాజులు దేవుడు మాన్యాల కోసం పీర్ల చావిడి, దర్గా, మసీదు నిర్మాణాల కోసం దాతలు ఇచ్చిన భూములను లాక్కునే హక్కు కానీ, అందులో చైర్మన్, సభ్యుల పేర్ల ద్వారా పదవుల రంగ ప్రవేశం చేసే హక్కు కానీ ఏ ఒక్కరికి లేదని ఆయన విమర్శించారు.. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తమ ఆలోచనను విరమించుకోవాలని లోక్ సభ, రాజ్యసభలో అమలు జరిపిన వక్ఫ్ సవరణ చట్టం 2025ను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.. రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీల హక్కుల సాధన కోసం దేశవ్యాప్త ఉద్యమాలను గాంధేయ మార్గంలో ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు.. తాను పిలుపునిస్తే తక్కువ ముస్లిం మైనార్టీ యువత స్వచ్ఛందంగా తరలి వచ్చారని, వారందరికీ తాను కృతజ్ఞతలు తెలుపుతున్నానని ఆయన అన్నారు.. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ ఆదేశాల మేరకు బుధవారం రాత్రి 9 గంటలకు నల్ల చట్టానికి నిరసనగా తమ తమ నివాస, వాణిజ్య సముదాయాలు వద్ద 10 నిమిషాల పాటు విద్యుత్ లైట్లను ఆర్పుతూ.. తెలిపే నిరసనకు మద్దతుగా బుధవారం ఖమ్మంలోని ఆర్ పి వి రాష్ట్ర కార్యాలయం వద్ద భారీ మోటార్ సైకిల్ ర్యాలీని జరిగింది.. ముస్లిం మైనారిటీ యువత తమ కుడి చేతికి నల్ల బ్యాడ్జి ధరించి... మోటారు సైకిల్ ర్యాలీలో పాల్గొనగా ఈ ర్యాలిని సంస్థ ఫౌండర్ సయ్యద్ సాదిక్ అలీ ప్రారంభించి, ర్యాలీలో పాల్గొన్నారు..ఈ ర్యాలీ ఖమ్మం నగరంలో వరంగల్ క్రాస్ రోడ్స్ నుంచి ప్రారంభమైన మోటార్ సైకిల్ ర్యాలి కాల్వ ఒడ్డు, మయూరిసెంటర్ పాత ఎల్ ఐ సి మీదుగా జడ్పీ సెంటర్ లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జిలు, ప్ల కార్డులు చేతబూని వక్ఫ్ సవరణ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు.. ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గం బాధ్యులు డాక్టర్ నజీర్.. రూరల్ మండలం నాయకులు హుస్సేన్ ఇబ్రహీం సోను యాకూబ్ పాషా కుమార్ ఆరిఫ్ తండా హుసేన్ అన్వర్ అబ్దుల్ షాహిద్ షరీఫ్ మోను కాసిం కాజల్ భాష మదర్, 59వ డివిజన్ ఆయేషా సిద్ధికి దానవాయిగూడెం నాయకులు రంజాన్ ఇబ్రహీం ఇఫ్తి కార్ ఆసిఫ్ అఫ్సర్, నాయుడుపేట ప్రాంత నాయకులు ఇబ్రహీం ఖాన్ అబ్బాస్ సోందు అజార్ ఖాసిం, తిమ్మాపురం మండలం నాయకులు సయ్యద్ ద్ బషీర్ , అక్సర్, సుభాన్ , గౌస్మియా మీరా, సైదా మల్సూర్ , బాబు, షబ్బీర్, మీరా, బాబా, సైఫ్, తదితరులు పాల్గొన్నారు..

## ఆపరేషన్ కగార్‌ను ఆపివేసి శాంతి చర్చలు జరపాలి

- **కర్రి గుట్టల నుండి కేంద్ర బలగాలను వెనక్కి పంపాలి**
- **రౌండ్ టేబుల్ సమావేశంలో రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామిక హక్కుల సంఘాలు డిమాండు**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

మంచికంటి భవన్లో బుధవారం వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. 'ఆపరేషన్ కగార్' ను వెంటనే ఆపేయాలని, ఆదివాసులపై జరుగుతున్న దాడిని నిలిపివేసి శాంతి చర్చలు జరపాలని, అదేవిధంగా ఆపరేషన్ కర్రిగుట్టలు పేరుతో కొనసాగిస్తున్న కేంద్ర బలగాలను వెంటనే వెనక్కి తీసుకురావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టు పార్టీ కాల్పుల విరమణ పాటించి శాంతి చర్చలు జరపాలని కోరడం జరిగింది. శాంతీయుత వాతావరణం నెలకొల్పడమే ప్రభుత్వాల లక్ష్యంగా ఉండాలనీ, ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధంగా వ్యవహరించి శాంతియుత వాతావరణం నెలకొల్పి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలి. రాజ్యాంగానికి లోబడి వ్యవహరించాలి. పారా మిలిటరీ బలగాలతో బల ప్రయోగంతో కాకుండా శాంతి చర్చల ద్వారా సమస్య పరిష్కారం జరిగేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించాలని కోరుతున్నాం. ఈ రౌండ్ సమావేశంలో మే 2న ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద మానవహారం నిర్వహించాలని, అన్ని మండల కేంద్రాలలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానించడం జరిగింది. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ప్రముఖ విద్యావేత్త రవి మారుత్, కాకి భాస్కర్, కిషన్ నాయక్ అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీఐటీయూ జాతీయ నాయకులు సాయిబాబా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా నాయకులు సింగు నరసింహారావు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు అవునూరి మధు, జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోట్ల నాగేశ్వర్ రావు, బిఆర్ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, బిచ్చాల తిరుమలరావు, మేకల సుగుణరావు, పాషా, టిజెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్రావు, ఖమ్మం బారసోసియేషన్ ప్రెసిడెంట్ తొండపు వెంకటేశ్వర్లు, ప్రముఖ విద్యావేత్త ఐవి రమణరావు, లక్ష్మయ్య, సమతా శ్రీధర్, తెలంగాణ పీపుల్స్ జేఏసీ జిల్లా కన్వీనర్ దేవిరెడ్డి, విజయ్, జర్నలిస్టు యూనియన్ జిల్లా కార్యదర్శి చిర్రా రవి, పౌర హక్కుల సంఘం రాష్ట్ర నాయకులు విప్లవ కుమార్, హెచ్ఆర్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఖాదర్ బాబు, బీసీ సంఘం నాయకులు పెరుగు వెంకటరమణ, ముస్లిం జేఏసీ నాయకులు అబ్దుల్ రెహమాన్, తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా ఉపాధ్యక్షులు నరేందర్, మోడం వెంకన్న, పిడిఎస్ జిల్లా కార్యదర్శి మస్తాన్, టిఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు పేర్ల మధు, ఎర్ర శ్రీను, బండారు రమేష్, లక్ష్మీనారాయణ, లక్ష్మక్క, తలారి శ్రీను, దాసరి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## హైదరాబాద్‌లో సిగ్ని ఎనర్జీ
# బీఈఎస్ఎస్ గిగా ఫ్యాక్టరీ ప్రారంభం

- ఇంధన నిల్వ రంగంలో మరో మైలురాయి
- టీఎస్ ప్రభుత్వం, ఐఐటీ భాగస్వామ్యంతో ఫేజ్-1 ప్రారంభం
- స్థానిక ప్రతిభకు ప్రోత్సాహం – ఉద్యోగావకాశాల విస్తరణ
- ప్రపంచ స్థాయి బీఈఎస్ఎస్ అసెంబ్లీ లైన్ ఏర్పాటు
- రూ.250 కోట్ల పెట్టుబడితో రెండు దశల్లో విస్తరణ
- 2 GWh తయారీ సామర్థ్యంతో మూడు కొత్త లైన్లు ఏర్పాటు
- నైపుణ్యం, ఆవిష్కరణలకు నూతన దిక్సూచి: జయేశ్ రంజన్
- సిగ్ని: మేక్ ఇన్ ఇండియా కింద గుర్తింపు పొందిన తొలి సంస్థ



**తెలంగాణ ముచ్చట్లు:**

హైదరాబాద్ కేంద్రంగా పని చేసే సిగ్ని ఎనర్జీ సంస్థ ఆటోమేటెడ్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బీఈఎస్ఎస్) గిగా ఫ్యాక్టరీని ఈరోజు ప్రారంభించినట్లుగా ఓ ప్రకటనలో తెలిపింది. హైదరాబాద్ నగరంలోని మహేశ్వరంలో గల ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్స్ వద్ద ఉన్న ఈమొబిలిటీ వ్యాలీలో దీనిని ఏర్పాటు చేశారు. అధునాతన ఇంజినీరింగ్, బ్యాటరీ మేనేజ్‌మెంట్ ల్యాబ్‌తో కూడిన వ్యవస్థ ఇక్కడ ఉంది. తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సీఎంవో ఇండస్ట్రీ, ఇన్వెస్ట్‌మెంట్ సెల్ సీఈవో జయేశ్ రంజన్ బుధవారం ఐఐటీ ఛైర్మన్, ఐల్యాబ్స్ గ్రూప్స్ వ్యవస్థాపకుడు శ్రీనిరాజులతో కలిసి ఫేజ్ 1ను ప్రారంభించారు.

నైపుణ్యం, ఆవిష్కరణల వైపు ఓ గొప్ప ముందడుగు : ఈ సందర్భంగా జయేశ్ రంజన్ మాట్లాడుతూ, సిగ్ని బీఈఈఎస్ ఏర్పాటు చేసి తన మొదటి మైలురాయిని అధిగమించినందుకు ప్రశంసించారు. రాష్ట్రంలో సిగ్ని బ్యాటరీ తయారీ గిగా ఫ్యాక్టరీ ప్రారంభమనేది తయారీ, నైపుణ్యం, ఆవిష్కరణల వైపు ఒక పరవర్తనాత్మక అడుగును సూచిస్తుందన్నారు. దీనివల్ల నూతన ఉద్యోగాల కల్పన, స్థానిక ప్రతిభను ప్రోత్సహించేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఎనర్జీ స్టోరేజ్ ఆవిష్కరణల్లో ఒక మంచి ఒరవడికి దోహదపడుతుందన్నారు.



అనంతరం సిగ్ని వ్యవస్థాపకులు, సంస్థ సీఈవో వెంకట్ రాజారామన్ మాట్లాడుతూ ఈ గిగాఫ్యాక్టరీ అనేది ఎనర్జీ, శక్తి నిల్వ రంగంలో అగ్రగామిగా నిలబెడుతుందన్నారు. సిగ్ని సంస్థ ఆటోమేటెడ్ బీఈఈఎస్ అధునాతన అసెంబ్లీ లైన్, అధిక నాణ్యతతో కూడిన బీఈఈఎస్ మాడ్యుల్ తయారీ కోసం రూపొందించినట్లుగా వివరించారు. ఇది ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన ఉత్తమ పద్ధతులను ఉపయోగించుకుంటుందని తెలిపారు. భవిష్యత్‌లో దేశీయంగా, అంతర్జాతీయంగా ఇంధన నిల్వ రంగంలో మరింత వృద్ధి చెందాలని భావిస్తున్నట్లు వెల్లడించారు.

రెండు దశల్లో మొత్తం రూ.250 కోట్ల పెట్టుబడితో ఇది రాబోయే రెండేళ్లలో సుమారు 1000 మందికి మించి ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాల కల్పనకు దారి తీస్తుందన్నారు.

ఈ విస్తరణలో భాగంగా ఇమొబిలిటి పరికరాలకు పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చేందుకు ప్రస్తుత లైన్‌లకు మూడు అదనపు ఆటోమెటెడ్ 2జీడబ్ల్యూహెచ్ సెల్‌టుప్యాక్ తయారీ లైన్‌లు, కంటైనర్ ఇంటిగ్రేషన్ సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు.

హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా పని చేస్తున్న ఈ సంస్థను 2014లో స్థాపించారు. ఎనర్జీ స్టోరేజ్ , ఇంజినీరింగ్‌కు సంబంధించిన సంస్థ ఇది. మేకిన్ ఇండియా కింద గుర్తింపు పొందిన మొదటి కంపెనీగా గుర్తింపు పొందింది. సిగ్ని వ్యవస్థాపకులు అటల్ ఇన్నోవేషన్ మిషన్‌లో గుర్తింపు పొందిన మెంటార్ కూడా. సిగ్ని సంస్థ ఆటోమోటివ్ రంగంలో అత్యున్నత స్థాయి నాణ్యత ధ్రువీకరణల్లో ఒకటైన ఐఏటీఎఫ్ 16949 సర్టిఫికెట్‌ను కూడా కలిగిఉంది.

# కాళేశ్వరం ఈఎన్సీ హరిరామ్ సస్పెండ్

- 14 ప్రాంతాల్లో ఏకకాల దాడులు
- హైదరాబాద్‌లో విల్లాలు, ఫ్లాట్లు
- అమరావతిలో వాణిజ్య స్థలం
- రూ.250 కోట్లకు పైగా ఆస్తులు పట్టుబాటు
- చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో హరిరామ్



**తెలంగాణ ముచ్చట్లు:**

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన కాళేశ్వరం ఈఎన్సీ భూక్యా హరిరామ్‌పై తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఆయన్ని సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో ఆయనకు కోర్టు రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ జైలులో ఉన్నారు. ఏప్రిల్ 26వ తేదీ ఉదయం 6 గంటల నుంచి రాష్ట్రవ్యాప్తంగా హరిరామ్‌కు సంబంధించిన 14 ప్రాంతాల్లో ఏక కాలంలో సోదాలు చేసిన ఏసీబీ బృందాలు పలుచోట్ల భూములు, ఇతర ఆస్తులు ఉన్నట్టు గుర్తించాయి. ఇప్పటివరకు గుర్తించిన ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.250 కోట్లకు పైనే ఉంటుందని ఏసీబీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే స్వాధీనం చేసుకున్న ఆస్తుల పత్రాలను పరిశీలిస్తున్నారు. హైదరాబాద్ శ్రీనగర్ కాలనీలో రెండు ఇండిపెండెంట్ గృహాలు, షేక్‌పేటలో ఒక విల్లా, కొండాపూర్‌లో ఒక విల్లా, మాదాపూర్‌లో ఒక ఫ్లాట్, నార్సింగిలో ఒక ఫ్లాట్, అమరావతిలో ఒక వాణిజ్య స్థలం, మర్కూక్ మండలంలో 28 ఎకరాల వ్యవసాయ భూమి, పటాన్‌చెరులో 20 గుంటల భూమి, బొమ్మలరామారంలో 6 ఎకరాల్లో మామిడి తోటతో కూడిన ఫామ్ హౌస్, కొత్తగూడెంలో నిర్మాణంలో ఉన్న ఒక భవనం, కుత్బుల్లాపూర్‌లో, మిర్యాలగూడలో స్థలాలు ఉన్నట్టు కీలక ఆధారాలను అధికారులు సేకరించారు.

# ఉద్యోగం పేరిట మోసం

- బ్యాంక్ ఉద్యోగం పేరుతో యువతిని మోసించిన నితిన్
- వాట్సాప్ సంభాషణల్లో నమ్మకాన్ని పొందిన నిందితుడు
- రిజిస్ట్రేషన్ ఫీజు పేరుతో మొదటగా రూ.30 వసూలు
- గూగుల్ మీట్ ఇంటర్వ్యూ ద్వారా స్క్రీన్ షేర్ ట్రాప్
- ఓటీపీలు, బ్యాంక్ డేటా చూసి ఖాతా నుంచి డబ్బుల బదిలీయువతికి రూ.95,050 నష్టం




**తెలంగాణ ముచ్చట్లు:**

ఉద్యోగం పేరిట ఓ యువతిని మోసం చేసిన ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. దోభీఘాట్, రోడ్ నంబర్ 1లో నివసించే నేతికుంట మౌనిక అనే యువతిని నితిన్ అనే వ్యక్తి ఈ నెల 15న ఫోన్ ద్వారా సంప్రదించాడు. తాను యాక్సిస్ బ్యాంక్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నానని చెప్పి, ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని మోసపూరితంగా నమ్మించాడు. ఆమెతో వాట్సాప్‌లో సంభాషణ కొనసాగిస్తూ, ఉద్యోగానికి రిజిస్ట్రేషన్ ఫీజు పేరుతో రూ.30 చెల్లించమని కోరాడు. మౌనిక తన ఐసీఐసీఐ క్రెడిట్ కార్డు ద్వారా చెల్లించింది. అనంతరం గూగుల్ మీట్ లింక్ ద్వారా ఇంటర్వ్యూకు హాజరు కావాలని, పరీక్షలో స్క్రీన్ షేర్ చేయాలని సూచించాడు. పరీక్ష జరుగుతున్న సమయంలో మౌనిక స్క్రీన్‌పై ఓటీపీలు, బ్యాంక్ వివరాలు కనిపించడంతో, ఆ వివరాలను దుర్వినియోగం చేసి ఆమె ఖాతా నుంచి మొదటగా రూ.40,000, తర్వాత రూ.51,050లు బదిలీ చేసుకున్నాడు. మొత్తం రూ.95,050 నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న మౌనిక వెంటనే 1930 నంబరుకు కాల్ చేసి సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేసింది. అనంతరం బంజారాహిల్స్ పోలీసులకు కూడా ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 పరీక్షలో
# అవకతవకలపై హైకోర్టు కీలక ప్రశ్నలు

- వారసత్వ హాల్‌టికెట్లు, ఒకే మార్కులపై కోర్టు దృష్టికి పిటిషనర్లు
- తెలుగు, ఆంగ్ల, ఉర్దూ మాధ్యమాలపై వేర్వేరు కీ పేపర్లు ఉన్నాయా? కోర్టు ప్రశ్న
- తెలుగు మాధ్యమంలో పరీక్ష రాసిన వారి వివరాలు సమర్పించాలని ఆదేశం
- తదుపరి విచారణ గురువారానికి వాయిదా



**తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణ గ్రూప్1 పరీక్షల నిర్వహణ, మూల్యాంకన ప్రక్రియలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై దాఖలైన పిటిషన్లపై హైకోర్టు సింగిల్ బెంచ్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా న్యాయస్థానం, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) అనుసరించిన విధానాలపై పలు కీలక ప్రశ్నలు సంధించింది.

విచారణ సందర్భంగా పిటిషనర్ల తరఫు న్యాయవాదులు తమ వాదనలు వినిపిస్తూ, వరుస క్రమంలో హాల్ టికెట్ నంబర్లు కలిగిన కొందరు అభ్యర్థులకు ఒకే విధమైన మార్కులు లభించాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండా, నిబంధనల ప్రకారం ప్రొవిజనల్ మార్కుల జాబితాను నిర్ణీత సమయంలో వెల్లడించలేదని, సుమారు 20 రోజుల తర్వాత తుది మార్కులను ప్రకటించారని తెలిపారు. ఈ మధ్యకాలంలో అవకతవకలు జరిగి ఉండవచ్చనే అనుమానాన్ని వారు వ్యక్తం చేశారు.

పిటిషనర్ల వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, టీజీపీఎస్సీ అనుసరించిన మూల్యాంకన ప్రక్రియ గురించి వివరాలు అడిగి తెలుసుకుంది. ముఖ్యంగా, తెలుగు మాధ్యమంలో పరీక్ష రాసిన అభ్యర్థుల జవాబు పత్రాలను ఎలా మూల్యాంకనం చేశారని ప్రశ్నించింది. "తెలుగులో పరీక్ష రాసిన వారికి తక్కువ మార్కులు వేశారనే ఆందోళన వ్యక్తమవుతోంది. మూల్యాంకనం కోసం జవాబులకు సంబంధించి ఏదైనా 'కీ' పేపర్ ఉంటుందా? తెలుగు, ఆంగ్లం, ఉర్దూ మాధ్యమాలకు వేర్వేరుగా 'కీ' ఇచ్చారా?" అంటూ టీజీపీఎస్సీని న్యాయస్థానం ప్రశ్నించింది.

దీనికి టీజీపీఎస్సీ ప్రతినిధులు స్పందిస్తూ, ఇది రాతపూర్వక పరీక్ష అయినందున మూల్యాంకనం చేసే నిపుణులకు ఎలాంటి 'కీ' పేపర్ ఇవ్వలేదని స్పష్టం చేశారు. జవాబు పత్రాలను దిద్దిన వారంతా సంబంధిత సబ్జెక్టులలో నిపుణులని, వారి నైపుణ్యం ఆధారంగానే మూల్యాంకనం జరిగిందని కోర్టుకు వివరించారు.

అనంతరం, ఈ గ్రూప్1 పరీక్షలో తెలుగు మాధ్యమంలో ఎంతమంది పరీక్ష రాశారు, వారిలో ఎంతమంది తుది ఎంపిక జాబితాలో ఉన్నారు అనే వివరాలను సమర్పించాలని టీజీపీఎస్సీని హైకోర్టు ఆదేశించింది. గతంలో జరిగిన గ్రూప్1 పరీక్షకు సంబంధించిన సమాచారాన్ని కూడా అందిస్తామని కమిషన్ కోర్టుకు తెలియజేసింది. రాష్ట్రంలో ఎంతోమంది నిరుద్యోగులు ఏళ్ల తరబడి గ్రూప్1 నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని, ఈ నేపథ్యంలో కేసు విచారణను అనవసరంగా ఆలస్యం చేయకుండా త్వరితగతిన ముగించాల్సిన అవసరం ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది. తదుపరి విచారణను న్యాయస్థానం గురువారానికి వాయిదా వేసింది.

# తెలంగాణ టెన్త్ ఫలితాలు విడుదల..

**తెలంగాణ ముచ్చట్లు:**


తెలంగాణ పదో తరగతి పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. బుధవారం మధ్యాహ్నం రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, భట్టి ఇతరులు టెన్త్ ఫలితాలను విడుదల చేశారు. మొత్తం ఐదు లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాయగా.. 92.78 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రకటించారు. గురుకులాల్లో 98 శాతం, ఆశ్రమ పాఠశాలల్లో 95 శాతం, ప్రైవేట్ పాఠశాలల్లో 94.12 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మొత్తంగా.. గతేడాది కంటే 1.47 శాతం అధికంగా ఉత్తీర్ణత సాధించినట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.



కాగా.. ఈసారి గ్రేడింగ్ స్థానంలో మార్కుల మెమోలపై సబ్జెక్ల వారీగా మార్కులు, గ్రేట్లను ఇచ్చారు. ఈమేరకు కొత్త మెమో నమూనాను కూడా విద్యాశాఖ విడుదల చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో మార్కుల విధానాన్ని తొలగించి గ్రేడింగ్ విధానాన్ని అమలులోకి తెచ్చిన విషయం తెలిసిందే. 2009 నుంచి ఈ విధానం అమలులోకి వచ్చింది. ఏ1, ఏ2, బీ1,బీ2, సీ1, సీ2, డి, ఈలుగా గ్రేడ్‌లను ఇచ్చేవారు. సబ్జెక్ట్‌ల వారీగా గ్రేడ్లతో పాటు సీజీపీఏ ఇచ్చేవారు. అయితే ఇప్పుడు అనూహ్యంగా ఈ విధానాన్ని తొలగించి సీజీపీఏ కాకుండా సబ్జెక్టులవారీగా మార్కులు, గ్రేడ్లు ఇవ్వాలని విద్యాశాఖ నిర్ణయించింది. అయితే విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాలు, తల్లిదండ్రులు, విద్యార్థులతో చర్చించకుండానే సరికొత్త విధానాన్ని అమలు చేయడం పట్ల అనేక ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

# గ్యాస్ లీకేజ్ ప్రమాదాలు: అప్రమత్తతే ఏకైక రక్షణ

- తాజాగా తల్లాడ మండలంలో గ్యాస్ లీక్‌తో ఇద్దరు మృతి– నలుగురు తీవ్రంగా గాయపడిన దుర్ఘటన
- గత ఏడాది సత్తుపల్లిలో గ్యాస్ మంటలతో భార్యాభర్తల మృతి
- నిరంతరం తనిఖీలు చేయడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చు – అగ్నిమాపకశాఖ అధికారి సూచన



**తెలంగాణ ముచ్చట్లు:**

ప్రమాదం ఎటు నుంచైనా రావొచ్చు. ఏ క్షణంలోనైనా జరగవచ్చు. దాని నుంచి తప్పించుకోవాలంటే అప్రమత్తత ఒక్కటే మార్గం. అయినా ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో తరచూ ఎక్కడో ఒకచోట గ్యాస్ సిలిండర్ల వల్ల అగ్నిప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వాటిలో కొందరు ప్రాణాలు కోల్పోతుండగా మరి కొందరు తీవ్రంగా గాయపడుతున్నారు. సోమవారం రాత్రి తల్లాడ మండలం మిట్టపల్లిలో వంట గ్యాస్ లీకైన ఘటనలో ఇద్దరు మృతి చెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడి చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు.

గతేడాది సత్తుపల్లి పురపాలిక పరిధిలోని హనుమాన్ నగర్‌లో వంట చేస్తున్న సమయంలో గ్యాస్ లీకై మంటలు ఎగిసిపడటంతో భార్యభర్తలు మరణించారు.

రెగ్యులేటర్‌ను సరిగ్గా బిగించకపోవటం లేదా దానిలోని ఓరింగ్ దెబ్బతినటం వల్ల గ్యాస్ లీక్ అవుతుంది. పాత లేదా నాసిరకం రెగ్యులేటర్‌ను ఉపయోగించటం.

స్టవ్‌కు అనుసంధానించిన రబ్బర్ హోస్‌లో చీలికలు, రంధ్రాలు ఏర్పడటం

స్టవ్‌లో నాబ్‌లు లేదా వాల్వ్‌లను సరిగ్గా మూసేయకపోవటం, బర్నర్‌లో అడ్డంకుల వల్ల గ్యాస్ లీక్ అయ్యే అవకాశముంది.

అధిక వేడి, అగ్ని మూలాలకు దగ్గరగా సిలిండర్లను ఉంచటం వల్ల ఒత్తిడి పెరగటం.

గ్యాస్ ఉపయోగించిన తర్వాత స్టవ్ నాబ్ లేదా రెగ్యులేటర్‌ను ఆఫ్ చేయకపోవటం వల్ల ఒక్కోసారి గ్యాస్ లీకవుతుంది. సిలిండర్ రవాణా లేదా ఇన్‌స్టాలేషన్ సమయంలో ఏమరపాటుగా ఉండటం కూడా కారణమే

ఎల్‌పీజీ అత్యంత దహనశీలమైనది. లీక్ అయిన గ్యాస్ అగ్ని మూలంతో కలవడం వల్ల పేలుడు సంభవిస్తుంది. ఇది ఆస్తి, ప్రాణ నష్టానికి దారితీస్తుంది.

లీక్ అయిన గ్యాస్(ప్రొపేన్, బ్యూటేన్) పీల్చుకోవటం వల్ల తలనొప్పి, మైకం, వికారం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అధిక గాఢతలో శ్వాస తీసుకుంటే ఊపిరాడకపోవటం, స్పృహ కోల్పోవటం లేదా మరణానికి దారితీయవచ్చు.

గ్యాస్ అసంపూర్తిగా దహనం అయినప్పుడు కార్బన్ మోనాక్సైడ్ విడుదలవుతుంది. ఇది విషపూరితమైంది. ఆరోగ్య సమస్యలు, మెదడు దెబ్బతినటం వంటి వాటికి కారణమవుతుంది. గ్యాస్ లీకేజీ ఘటనలు కుటుంబ సభ్యుల్లో భయం, ఆందోళన, మానసిక ఒత్తిడిని పెంచుతాయి. గ్యాస్ లీక్ డిటెక్టర్(అలారం) అమర్చుకోవాలి. ఇది గ్యాస్ గాఢతను గుర్తించి అలారం సౌండ్ చేస్తుంది. దీన్ని వంటగదిలో సిలిండర్ సమీపంలో అమర్చుకోవాలి. ఆటోమేటిక్ గ్యాస్ షట్ ఆఫ్ వాల్‌ను సిలిండర్ రెగ్యులేటర్‌తో అనుసంధానించుకోవాలి. ఇది గ్యాస్ లీకయ్యే సమయంలో స్వయంచాలకంగా సరఫరాను నిలిపివేస్తుంది. అగ్ని, పేలుడు ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఐఎస్ఐ మార్క్ కలిగిన రెగ్యులేటర్, హోస్‌లను ఉపయోగించాలి. ఇవి గ్యాస్ లీకయ్యే అవకాశాలను తగ్గిస్తాయి. వీటిని గడువు లోపు మార్చుతూ ఉండాలి. గ్యాస్ లీకేజీ ఎక్కడ ఉందో గుర్తించాలని, వాసన ఎక్కడ వస్తుందో చూడాలని, ఒకవేళ గ్యాస్ వాసన వస్తే ఇంట్లోని కిటికీలు, తలుపులు తీసి ఉంచాలి ఖమ్మం జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి అజయ్‌కుమార్ సూచించారు. అవసరమైతే అగ్నిమాపక సిబ్బందికి సమాచారమివ్వాలని తెలిపారు. గ్యాస్ పైపును సైతం ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలని వివరించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# కార్మికుల శ్రమే అభివృద్ధికి మూలస్తంభం

◆ **మాజీ ఎంపీ నామ**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**



అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం (మే డే) సందర్భంగా బిఆర్ఎస్ మాజీ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు కార్మిక కుటుంబాలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం మీడియా కు ఒక పత్రిక ప్రకటన విడుదల చేసారు. కార్మికులు దేశ నిర్మాణ శిల్పులని వారి శ్రమ లేకుండా అభివృద్ధి అసాధ్యమని పేర్కొన్నారు. కార్మికులు పని చేసే ప్రతిచోటా వారి వంతు శ్రమ, అంకితభావం నిండి ఉందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రాణవాయువులా పనిచేసే ఈ వర్గాన్ని గుర్తించి, వారి హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పదిహేను, పదిహేడవ లోక్ సభల్లో తాను కార్మికుల హక్కుల కోసం, సింగరేణి సమస్యలు పైన లోక్ సభలో మాట్లాడటం జరిగిందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికుల సంక్షేమం పట్ల ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్మికుల కోసం అనేక అభివృద్ధి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అలాగే అసంగటిత రంగ కార్మికులకు ప్రత్యేక గుర్తింపు కల్పించి వారికి సహాయం చేసే విధంగా నాడు అనేక కార్యక్రమాలు చేపట్టడం గర్వించదగిన విషయం అని పేర్కొన్నారు. ఇప్పటికీ పలు రంగాల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి అవసరమని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు.కార్మికుల పట్ల ఉన్న అసమానతలు తొలగించేందుకు ప్రతి ఒక్కరి కృషి అవసరమని, కార్మికుల శక్తిని గౌరవించడమే నిజమైన అభివృద్ధికి నాంది అని అన్నారు. దేశ అభివృద్ధికి జీవనాధారమైన వారిని గౌరవించడం, వారికో భద్రమైన జీవితం కల్పించడం తో పాటు వారి జీవితాల్లో వెలుగు నింపాల్సిన అవసరం ఉందని అని నామ స్పష్టం చేశారు.

# రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్య కొనుగోళ్లు జరగాలి..

◆ **అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి.**
◆ **తహసీల్దార్లు మండల స్థాయిలో కొనుగోలు ప్రక్రియ పర్యవేక్షించాలి.**
◆ **ధాన్యం కొనుగోలుపై తహశీల్దార్లతో సమీక్ష నిర్వహించిన అదనపు కలెక్టర్.**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**





రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్య కొనుగోళ్లు పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్, ధాన్య కొనుగోళ్లపై తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి, రైతులకు త్వరగా చెల్లింపులు చేసేలా చర్యలు చేపట్టాలని అన్నారు. కొనుగోలు వివరాలను ఎప్పటి కప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేసేలా చూడాలని అన్నారు.

యాసంగి పంటకు గాను జిల్లాలో 351 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ఇప్పటివరకు 83 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, దీనికి గాను రైతులకు 85 కోట్ల 30 లక్షల రూపాయల చెల్లింపులు కూడా పూర్తి చేశామని, ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల వద్ద మరో 22 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉందని అధికారులు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్స్ కు తరలించేలా పర్యవేక్షణ చేయాలన్నారు. కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన వసతులు కల్పించాలని, కొనుగోలు కేంద్రాల వద్ద ఎట్టి పరిస్థితుల్లోనూ కోతలు ఉండడానికి వీలులేదని, రైతులకు ఎక్కడ నష్టం రాకుండా చూసుకోవాలని, కొనుగోలు కేంద్రాల వద్ద గన్ని బ్యాగుల కొరత రాకుండా చూసుకోవాలని అన్నారు.

ఎఫ్ఏక్యూ ప్రమాణాలు ఉన్న ధాన్యం కొనుగోలు చేయాలని, ఖచ్చితంగా రైతులు తూర్పార పట్టి ధాన్యాన్ని కేంద్రాలకు తెచ్చే విధంగా చూడాలని అన్నారు. తహశీల్దార్లు రోజు కనీసం ఒక ధాన్య కొనుగోలు కేంద్ర సందర్శన చేయాలని, కొనుగోలు కేంద్రంలో ఎంత మేర ధాన్యం కొన్నది, ఎంత మేర మిల్లులకు తరలించింది, గన్ని బ్యాగులు ఎన్ని తీసుకున్నది, ఎన్ని గన్ని బ్యాగులు వాడింది, ఇంకా గన్ని బ్యాగులు అవసరం తదితర వివరాలన్నీ తెలుసుకొని, లోతుపాట్లపై చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలు ఉంటే స్థానికంగా పరిష్కరించాలని, స్థానికంగా పరిష్కారం చేయలేకపోతే వెంటనే పై అధికారుల దృష్టికి తేవాలని అన్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అన్నారు. ఈ సమీక్షలో ట్రాన్స్కో ఎస్ఇ శ్రీనివాసా చారి, డిసిఒ గంగాధర్, కల్లూరు ఆర్డీవో రాజేందర్ గౌడ్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, తహశీల్దార్లు, ఏపీఎం లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పది ఫలితాల్లో శ్రీ గ్లోబల్ హైస్కూల్ ప్రభంజనం

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**



బుధవారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పది ఫలితాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పది ఫలితాలను విడుదల చేయడం జరిగింది. ఆ ఫలితాలలో శ్రీ గ్లోబల్ హై స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు ఉన్నతమైన మార్కులను సాధించడమే కాకుండా చింతకాని, బోనకల్ మండలాల్లో మొదటి స్థానాన్ని కైవసం చేసుకోవడం జరిగింది. (ఎండి. సోహెల్ 569/600). అంతేకాకుండా 100% ఉత్తీర్ణత ఫలితాలను సాధించి బోనకల్లు చింతకాని మండలాల్లో సాటిలేని స్కూల్ గా నిరూపించుకోవడమే కాకుండా శ్రీ గ్లోబల్ హై స్కూల్ ఉన్నత శిఖరాలను చేరుకునే విధంగా చేసినారు. ఇంతటి ఘనమైన విజయాలను సాధించి రెండు మండలాల్లో మొదటి స్థానంలో గ్లోబల్ హైస్కూల్ ఉంచినందుకు గాను శ్రీ గ్లోబల్ హై స్కూల్ ఫౌండర్ ఇనుకుల్ల దివాకర్ రెడ్డి గారు మాట్లాడుతూ ఇంతటి ఘనవిజయాన్ని సాధించినటువంటి విద్యార్థిని విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు తల్లిదండ్రులు విద్యార్థిని విద్యార్థులను అభినందించడం జరిగింది.



# ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులకు సన్మానం

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులకు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పూలమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ .. సుదీర్ఘ కాలంగా వివిధ విభాగాలలో భాధ్యతయుతమైన విధులు నిర్వహించి పోలీస్ శాఖ కు ఎనలేని సేవలతో పోలీస్ అధికారుల మన్ననలు పొందారని పోలీస్ కమీషనర్ కొనియాడారు. విధినిర్వహణలో తోడ్పాటు అందించిన కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. పదవి విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో అనందంగా వారి భావి జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు.

**ఉద్యోగ విరమణ పొందిన వారు**

ఎం. దానయ్య ఎస్సై పిసిఆర్ ఖమ్మం.
కె.నాగరాజు ఏఎస్ఐ ఖమ్మం త్రీ టౌన్ పిఎస్.
జె. కాంచన దేవి ఎల్ జి ఎస్ (సీపీ కార్యాలయం)

ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఆడ్మిన్ నరేష్ కుమార్, అడిషనల్ డీసీపీ లా& ఆర్డర్ ప్రసాద్ రావు, ఆర్ ఐ కామరాజు, పోలీస్ అసోసియేషన్ ఇంచార్జి అధ్యక్షుడు వేంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# హైకోర్టు ఆదేశించినా జాప్యం ఎందుకు..?

◆ **నిమ్జ్ బాధితులకు నష్టపరిహారం వెంటనే చెల్లించాలి :**
◆ **జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు.**

**సంగారెడ్డి బ్యూరో / జహీరాబాద్ తెలంగాణ ముచ్చట్లు.**



ఝరాసంఘం మండల పరిధిలో ఎల్గోయి గ్రామానికి చెందిన బాధిత రైతుల నుంచి నిమ్జ్ ప్రాజెక్టు కోసం సేకరించిన భూములకు పరిహారం, చెల్లింపులు పట్టా ప్రభుత్వ భూములకు సంబంధించి తేడాలు ఉండడంతో రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. బాధిత రైతులు పరిహారం కోసం సంబంధిత అధికారులను ఆశ్రయించినా.. చెల్లింపు విషయంలో అధికారులు జాప్యం చేస్తున్నారు. దీంతో బాధిత రైతులు ఇవాళ జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు దృష్టికి తీసుకెళ్లారు.

నిమ్జ్ ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న బాధిత రైతులకు మెరుగైన పరిహారాన్ని అందించాలని హైకోర్టు ఆదేశించినప్పటికీ పరిహారాన్ని చెల్లించడంలో జాప్యం ఎందుకు చేస్తున్నారని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు సంబంధిత అధికారులను ప్రశ్నించారు. ఝరాసంఘం మండలం ఎల్గోయి గ్రామానికి చెందిన భూ బాధిత రైతుల నుంచి నిమ్జ్ ప్రాజెక్టు కోసం భూములు సేకరించారు. సేకరించిన భూములకు పరిహారం, చెల్లింపులు పట్టా ప్రభుత్వ భూములకు సంబంధించి తేడాలు ఉండడంతో రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు.

మెరుగైన పరిహారాన్ని చెల్లించాలని బాధిత రైతులు హైకోర్టును ఆశ్రయించారు. రైతుల గోడును విన్న హైకోర్టు బాధిత రైతులకు మెరుగైన పరిహారాన్ని చెల్లించాలని నిమ్జ్ ప్రాజెక్టు అధికారులను ఆదేశించింది. ఈ విషయంలో బాధిత రైతులు పరిహారం కోసం సంబంధిత అధికారులను ఆశ్రయించినా.. చెల్లింపు విషయంలో అధికారులు జాప్యం చేస్తున్నారు. దీంతో బాధిత రైతులు ఇవాళ జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే బాధిత రైతులతో కలిసి నిమ్జ్ ప్రాజెక్టు కార్యాలయానికి తల్లి వెళ్లారు. స్థానిక నిమ్జ్ ప్రాజెక్ట్ డిప్యూటీ కలెక్టర్ రాజుతోఎమ్మెల్యే బాధిత రైతుల పరిహారం విషయమై మాట్లాడారు. బాధిత రైతులకు పరిహారాన్ని చెల్లించాలని హైకోర్టు ఆదేశించినప్పటికీ ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. బాధిత రైతులను కార్యాలయం చుట్టూ తిప్పించుకోవడం సరికాదన్నారు. వెంటనే తగు చర్యలు తీసుకొని బాధిత రైతులకు పరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. మే 4వ తేదీన ఝరాసంఘంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి బాధిత రైతులకు పరిహారం అందజేస్తామని నిమ్జ్ ప్రాజెక్ట్ డిప్యూటీ కలెక్టర్ రాజు చెప్పారు. ఈకార్యక్రమంలో జహీరాబాద్, ఝరాసంఘం మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ, నాయకులు వెంకటేశం, బాధిత రైతులు తదితరులు ఉన్నారు.

# డ్రంకన్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవర్లకు ట్రాఫిక్ పోలీసుల కౌన్సిలింగ్

◆ **ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**



మైనర్ డ్రైవింగ్ తో పాటు మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులను నమోదు చేసి న్యాయస్థానంలో శిక్షలు పడేలా ట్రాఫిక్ పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల నగరంలో చేపట్టిన వాహనాల తనిఖీలలో డ్రంకెన్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవర్లు ఎక్కువ సంఖ్యలో పట్టుబడుతునట్లు తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపి ఏదైనా జరగరానిది జరిగితే ఆ తర్వాత కుటుంబ సభ్యులు ఎలా బాధపడతారో తెలిపేలా సిద్ధం చేసిన వీడియోలను స్క్రీన్ పై చూపిస్తున్నామని తెలిపారు. పిల్లలు అనాథలుగా మారడం, యాక్సిడెంట్స్ జరిగితే కుటుంబాలు వీధిపాలు కావడం వంటి వీడియోలు చూపడంతో పాటు తల్లి దండ్రులకు సైతం కౌన్సెలింగ్ ఇస్తున్నామని తెలిపారు. చివరకు మళ్లీ డ్రంకెన్ డ్రైవ్ చేయబోమని వాళ్లతో ప్రమాణం చేయిస్తున్నామని, కౌన్సెలింగ్ తర్వాత వాళ్లను కోర్టులో ప్రొడ్యూస్ చేస్తున్నట్లు తెలిపారు. న్యాయస్థానం జరిమానా విధిస్తున్నారని తరచూ.. తప్పు చేస్తే జైలు శిక్ష కూడా విధిస్తున్నారని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు నగరంతో ప్రతిరోజు డ్రంకెన్ డ్రైవ్స్ తనిఖీలు చేపడుతునట్లు తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్ లో మొదటిసారి పట్టుబడితే కౌన్సెలింగ్ ఇచ్చి, కోర్టుకు సబ్మిట్ చేస్తున్నాం. తరచూ పట్టుబడితే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయాలని ఆర్టీఏ ఆఫీసర్లకు లెటర్ పెడుతున్నామని తెలిపారు. కాగా డ్రంకెన్ డ్రైవింగ్ కేసులలో పట్టుబడి శిక్ష ఖరారైన వాహనదారులకు ప్రభుత్వ ఉద్యోగాలు, వీసాలు, పాసుపోర్టు అంశాల్లో ఇబ్బందులు తలెత్తుతాయని స్పష్టం చేశారు.ఎవరైనా తాగి పట్టుబడితే ఫ్యామిలీ మెంబర్స్ ముందే వాళ్లకు కౌన్సెలింగ్ ఇస్తున్నామని, తాగి డ్రైవ్ చేసే వారిలో మార్పు తెచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. వారానికి రెండు సార్లు ఇలా కౌన్సెలింగ్ ఇస్తున్నామని అన్నారు.

# సమాజాన్ని నిర్మించిన బసవేశ్వరుడు ఆదర్శం

◆ **డా.ముప్పారం ప్రకాశం, సాహసం రాష్ట్ర అధ్యక్షులు.**

**సంగారెడ్డి బ్యూరో తెలంగాణ ముచ్చట్లు,**




భారత సమాజాన్ని మతం పేరుతో, ఆచార వ్యవహారాల పేరుతో, ధర్మం పేరుతో అగాధం లోనికి నెట్టేసె ప్రయత్నం చేస్తుంటే బ్రాహ్మణ కులంలో పుట్టి


సమ సమాజ మార్పు కోసం కర్ణాటక కేంద్రంగా పురోహిత వర్గాన్ని వ్యతిరేకించి మనుధర్మానికి ధీటుగా లింగాయత్ ధర్మాన్ని ఏర్పాటుచేసిన బసవేశ్వరుడు మాకు ఆదర్శమూర్తి అని సాహసం రాష్ట్ర అధ్యక్షులు డా ముప్పారం ప్రకాశం అన్నారు.

మహాత్మా బసవేశ్వర 892వ జయంతి ఉత్సవాల్లో భాగంగా నేడు సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ గ్రీవెన్స్ సెల్ నందు జరిగిన ఉత్సవ సభలో పాల్గొన్న ప్రకాశం మాట్లాడుతూ సనాతన ధర్మం పేరుతో మనుధర్మం పేరుతో భారత దేశ ప్రజల మధ్యల మూఢ నమ్మకాలు ఆచార పద్ధతుల పేరుతో మను ధర్మాన్ని అడ్డం పెట్టుకొని భారత సమాజాన్ని పురోహిత వర్గం దోచుకుంటుంటే బిచ్చలదేవుడి సంస్థానంలో మంత్రిగా ఉన్న బసవేశ్వరుడు మనిషిని మనిషి దోచుకునే సమాజాన్ని సమూలంగా మార్చి ఈ దేశ ప్రజల భవిష్యత్తు కోసం కూడు గుడ్డ నీడ విద్య వైద్యం అనే లక్ష్యాలతో ఈ దేశంలో భక్తి ఉద్యమానికి నాంది పలికిన మహనీయుడు బసవేశ్వరుడని కొనియాడాడు. ఈరోజు పాలకులు మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తే సరిపోదని వారి ఆశయాలను ఆచరణలో పెట్టిన రోజే మహనీయులకు నిజమైన నివాళులని ఆ మహనీయుల వారసులుగా ప్రజలు వారి ఆశయ సాధన కోసం సైనికులుగా పోరాటం చేయాలని, భక్తులుగా మిగిలిపోకూడదని ప్రకాశం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ చైర్మన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి, గ్రంధాలయ చైర్మన్ అంజయ్య యాదవ్, జిల్లా అధికారులు జగదీష్ లింగాయత్ సంఘ నాయకులు, బహుజన సంఘాల నాయకులు పల్పనూరి శేఖర్, పోలీస్ రామచంద్రయ్య, రమేష్‌గౌడ్, కున వేణు తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారమే మేడేకు నిజమైన అర్థం

◆ **తాటికాయల భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం అధ్యక్షులు బొల్లెపాక యాదగిరి డిమాండ్**

**ధర్మసాగర్,తెలంగాణ ముచ్చట్లు:**



"ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని మనం ప్రతి సంవత్సరం ఘనంగా జరుపుకుంటున్నాం. కానీ ఈ పండుగకు నిజమైన అర్థం వచ్చేలా కార్మికుల జీవితాల్లో మార్పు రావాలి. మా సమస్యలు చెవికి వినిపించేలా అధికార వ్యవస్థ స్పందించాలి" అని తాటికాయల గ్రామ భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం అధ్యక్షులు బొల్లెపాక యాదగిరి అన్నారు.

బుధవారం బొల్లెపాక యాదగిరి మీడియాతో మాట్లాడుతూ - "భవన నిర్మాణ కార్మికులకు ఎన్నో హక్కులు చట్టంలో ఉన్నప్పటికీ అవి కేవలం కాగితాల పరిమితంగా మిగిలిపోతున్నాయి. కార్మిక సంక్షేమ బోర్డులో కార్మికులకే ఛైర్మన్ పదవి ఇవ్వాలని, కార్మికులకు మంజూరైన పథకాలను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించకుండా ప్రభుత్వం స్వయంగా నిర్వహించాలనే మా డిమాండ్లను మళ్లీ, మళ్లీ చెబుతున్నా స్పందన లేకపోవడం బాధాకరం" అని ఆవేదన వ్యక్తం చేశారు.

"మా కార్డులు తాత్కాలికంగా కాకుండా శాశ్వతంగా పనిచేసేలా చూడాలి. కార్మిక శాఖకు ప్రత్యేకంగా ఓ మంత్రిని నియమించాలి. వయస్సు 55 పూర్తైన ప్రతి కార్మికుడికి పెన్షన్ కల్పించాలి. పని సమయంలో ప్రమాదవశాత్తు మరణించిన కార్మిక కుటుంబాలకు కనీసం పదిహేను లక్షల రూపాయల భీమా సాయం అందించాలి. అలాగే ఉపాధి హామీ కూలీలను శాశ్వత ఉద్యోగులుగా మారుస్తూ బోర్డు పరిధిలోనే కొనసాగించాలి" అని స్పష్టం చేశారు.

ఇక కాంగ్రెస్ పార్టీపై కూడా బొల్లెపాక యాదగిరి అసంతృప్తి వ్యక్తం చేశారు. "ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన తర్వాత భవన నిర్మాణ కార్మికులకు స్కూటీలు (ద్విచక్ర వాహనాలు) అందిస్తానని వాగ్దానం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పటి వరకూ ఆ మాటను నిలబెట్టుకోలేదు. కార్మికుల అవసరాలు ఓటు వేసేంతవరకే అని భావిస్తే అది పెద్ద తప్పు. కార్మికుల విశ్వాసాన్ని నిలబెట్టాలంటే వెంటనే ఆ వాహనాలను అందించాలి" అని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా కార్మికుల త్యాగాలను గుర్తు చేస్తూ - "వేలాది మంది కార్మికులు 8 గంటల పని హక్కు కోసం తమ జీవితాలను అర్పించారు. వారికి నిజమైన గౌరవం ఇచ్చే దిశగా ప్రభుత్వం నడవాలి. లేవని ఈ రోజు మాటలకే పరిమితం కాకుండా చర్యలతో మద్దతుగా నిలవాలి" అని వ్యాఖ్యానించారు.

# శ్రీ మహాత్మా బసవేశ్వర ఆశయాలు అందరికీ ఆదర్శనీయం....

◆ **జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి జ్యోతి**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

శ్రీ మహాత్మా బసవేశ్వర ఆశయాలు మనందరికీ ఆదర్శనీయమని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి గుడికందుల జ్యోతి అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి కార్యాలయంలో శ్రీ మహాత్మా బసవేశ్వర జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ మహాత్మా బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో లింగాయత్ కమ్యూనిటీ, బీసీ కమ్యూనిటీకి చెందిన టి.వి. ప్రసాద్, కె. కోటేశ్వర రావు, శర్మ, మల్లయ్య, వీరభద్రం, రాజ్యలక్ష్మి, భార్గవి, ఏ.బి.సి.డి.ఓ. మందుల ఈదయ్య, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలు అవకతవకలు

◆ **ఎంపీ కంటెస్టెడ్ అభ్యర్థి షేక్ మొహమ్మద్ రసూల్ ( రఫీ )**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**



ఖమ్మం జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అవకతవకలు జరుగుతున్నాయని నిజమైన పేద ప్రజల లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు అందించాలని ఖమ్మం ఎంపీ కంటెస్టెడ్ అభ్యర్థి షేక్ మొహమ్మద్ రసూల్ ( రఫీ ) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొన్ని మండలాలలో 130 చదరపు గజాలు రేకుల ఇల్లు ఉన్న వాళ్లకు మిగతా ఆస్తి లేకుండా ఉన్నప్పటికీ వారు కూలికి పోయి జీవన ఉపాధిని నడిపిస్తున్నారు ఇలాంటి వారికి ఇందిరమ్మ ఇల్లు రాకుండా కొంతమంది కాంగ్రెస్ నాయకులకు 2 , 3 ఎకరాలు ఉన్నప్పటికీ వారకీ అర్హత లేకున్నప్పటికీ ఇందిరమ్మ ఇండ్లు కేటాయించారని ఆరోపించారు అర్హులకు న్యాయం జరగకుంటే నిరాహార దీక్షకు సిద్ధమని తెలిపారు.

# విజయం సాధించాలని కోరుకుంటున్నా..



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటిస్తున్న తాజా చిత్రం 'రెట్రో'. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో రాబోతున్న ఇందులో పూజా హెగ్డే నటిస్తున్న ఈ రొమాంటిక్ యాక్షన్ చిత్రాన్ని స్టోన్ బెంచ్ క్రియేషన్స్, 2డి ఎంటర్టైన్‌మెంట్స్ బ్యానర్స్‌పై నిర్మిస్తున్నారు. అయితే ఇందులో సంతోషం నారాయణ్, జయరామ్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఇప్పటికే 'రెట్రో' నుంచి విడుదలైన పోస్టర్స్, టీజర్, ట్రైలర్, అన్ని మంచి రెస్పాన్స్‌ను దక్కించుకున్నాయి.

అయితే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా భారీ అంచనాల మధ్య మే 1న థియేటర్స్‌లోకి రాబోతుంది. దీంతో మూవీ టీమ్ ప్రమోషన్స్ కూడా బాగానే చేశారు. ఇదిలా ఉంటే.. తాజాగా, హీరో సూర్య ట్విట్టర్ ద్వారా ఓ ఇంట్రెస్టింగ్ పోస్ట్ పెట్టారు. ''మే 1న మా రెట్రో సినిమాతో పాటు టూరిస్ట్ ఫ్యామిలీ, హిట్ 3, రైడ్ 2 రిలీజ్ కాబోతున్నాయి. ప్రియమైన శశి, సిమ్రాన్, నాని, అజయ్ సర్, రితేష్‌తో పాటు ఇతర టీమ్ సభ్యులకు సిబ్బందికి నా శుభాకాంక్షలు. రెట్రోపై అభిమానులు చూపుతున్న ప్రేమ మద్దతుకు కృతజ్ఞతలు. రిలీజయ్యే ప్రతి సినిమా విజయవంతం కావాలని కోరుకుంటున్నాను'' అని రాసుకొచ్చారు. ఇక ఈ పోస్ట్ చూసిన నెటిజన్లు మనమే హిట్ కొడతాం అన్నా.. నువ్వు చాలా గ్రేట్ అని కామెంట్లు పెడుతున్నారు.

# శింబు అభిమానులకు పండగే



ప్రదీప్ రంగనాథన్ నటించిన, అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహించిన 'డ్రాగన్' ఫిబ్రవరి 21న థియేటర్లలో విడుదలై బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. ఈ చిత్రం సంచలన విజయం సాధించడంతో, దర్శకుడు అశ్వత్ మారిముత్తు జోరుమీదున్నారు. 'డ్రాగన్' విడుదల కాకముందే, అశ్వత్ మారిముత్తు తన తదుపరి చిత్రం గురించి ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. శింబు (సిలంబరసన్ టి.ఆర్.) హీరోగా నటించనున్న ఈ చిత్రానికి ప్రస్తుతం 'STR 51' అనే వర్కింగ్ టైటిల్‌ను ఖరారు చేశారు.

ఇటీవల జరిగిన ఒక అవార్డుల కార్యక్రమంలో అశ్వత్ మారిముత్తు మాట్లాడుతూ, 'STR 51' చిత్రం శింబు అభిమానులకు ఒక అద్భుతమైన కానుకలా ఉంటుందని స్పష్టం చేశారు. 'డ్రాగన్' విడుదల కాకముందే శింబు తనపై ఉంచిన నమ్మకమే ఈ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చడానికి ప్రధాన కారణమని ఆయన పేర్కొన్నారు. శిలంబరసన్ టి.ఆర్. తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకోవడానికి కనీసం ఒక బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందించడానికి తాను దృఢంగా నిశ్చయించుకున్నానని అశ్వత్ ఉద్ఘాటించారు. అంతేకాకుండా, ఈ ప్రాజెక్ట్ షూటింగ్ సెప్టెంబర్‌లో ప్రారంభమయ్యే అవకాశం ఉందని ఆయన తెలిపారు. 'STR 51' చిత్రం సిలంబరసన్ టి.ఆర్. అభిమానులకు ఒక మెగా ట్రీట్‌గా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.

ఈ ప్రకటన వెలువడిన వెంటనే, సోషల్ మీడియాలో శింబు అభిమానులు సంబరాలు చేసుకోవడం ప్రారంభించారు. 'STR 51' చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకులలో భారీ అంచనాలు ఉన్నాయని, అశ్వత్ మారిముత్తు నమ్మకం ఈ అంచనాలను మరింత పెంచుతోందని వారు విశ్వసిస్తున్నారు. 'STR 51' ఎలా రూపుదిద్దుకుంటుందో, శింబు అభిమానులకు ఇచ్చిన వాగ్దానాలను అశ్వత్ మారిముత్తు నిలబెట్టుకుంటారో లేదో, విడుదలైన తర్వాత ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకుంటుందో లేదో వేచి చూడాలి. కానీ, అప్పుడే మొదలైన ఈ సందడి మాత్రం శింబు అభిమానులకు ఒక పెద్ద పండుగను తలపిస్తోంది..



# మహారాణి లుక్‌లో వారెవ్వ అనిపిస్తున్న యంగ్ బ్యూటీ..

యంగ్ బ్యూటీ ఆకాంక్ష శర్మ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. రీసెంట్‌గా విశ్వక్ సేన్ నటించిన 'లైలా' మూవీతో మన ముందుకు వచ్చి భారీ డిజాస్టర్ అందుకుంది. ప్రస్తుతం ఈ భామ 'కేసరి వీర్' చిత్రంలో నటిస్తోంది. బాలీవుడ్ స్టార్ హీరో సునీల్ శెట్టి హీరోగా ప్రిన్స్ ధీమాన్ తెరకెక్కిస్తున్న సినిమాలో సూపర్ పంచోలి, వివేక్ ఒబెరాయ్ కీ రోల్ ప్లే చేస్తున్నారు. ఇక ఈ చిత్రాన్ని చౌహాన్ స్టూడియోస్, పనోరమా స్టూడియోస్ బ్యానర్స్ పై నిర్మిస్తున్నారు. అయితే తుగ్లక్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడిన ధైర్య యోధుడు హమీర్జీ గోహిల్ కథ ఆధారంగా ఈ మూవీ తెరకెక్కుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోన్న ఈ చిత్రం మే 16న థియేటర్లలోకి రానుంది. ఇక రీసెంట్‌గా ఈ మూవీ ట్రైలర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ మేరకు ఆకాంక్ష శర్మ మహారాణిలా రెడీ అయి ఇన్‌స్టాగ్రామ్‌లో ఆ ఫొటోస్ షేర్ చేసింది. అంతేకాకుండా వాటికి 'మీరు ఇప్పటికైనా కేసరి వీర్ ట్రైలర్ చూశారా..?' అని క్యాప్షన్ జోడించింది. దీంతో ఈ పోస్ట్ కాస్తా నెట్టింట వైరల్‌గా మారింది. కాగా ఈ మూవీ అయిన ఈ ముద్దుగుమ్మకు కలిసి వస్తుందేమో చూడాలి.

# ఆస్పత్రిలో కోలీవుడ్ స్టార్ అజిత్ కుమార్



కోలీవుడ్ స్టార్ హీరో అజిత్‌కుమార్ ఆస్పత్రిలో చేరారు. ఆయన కాలికి స్వల్ప గాయం కావడంతోనే చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరినట్లు తెలుస్తోంది. అయితే అజిత్‌కు ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. చెన్నై ఎయిర్‌పోర్ట్ చేరుకున్న ఆయనకు స్వాగతం పలికేందుకు అభిమానులు పెద్దఎత్తున వచ్చారు. అదే సమయంలో భారీ సంఖ్యలో ఫ్యాన్స్ దూసుకు రావడంతో అజిత్ కాలికి స్వల్ప గాయాలైనట్లు ఆయన టీమ్ వెల్లడించింది.

కాగా.. ఢిల్లీలో జరిగిన పద్మ అవార్డుల కార్యక్రమానికి హాజరైన అజిత్ కుమార్.. తిరిగి చెన్నై చేరుకున్నారు. అజిత్ రాకపై సమాచారం తెలుసుకున్న అభిమానులు ఆయనకు స్వాగతం పలికేందుకు చెన్నై ఎయిర్‌పోర్ట్‌కు పెద్దఎత్తున వచ్చారు. ఆ సమయంలో ఒక్కసారిగా అందరూ అజిత్ వైపు దూసుకు రావడంతో ఆయన పాదానికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో వెంటనే ఆస్పత్రిలో చేరాల్సి వచ్చింది.

# ఊహించని ప్లానింగ్ తో విజయ్ సేతుపతి



పాన్ ఇండియా స్థాయిలో పేరు తెచ్చుకున్న నటుడు విజయ్ సేతుపతి. స్వతహాగా తమిళం అయినప్పటికీ.. తెలుగు, హిందీతో పాటు ఇతర భాషల్లోనూ మంచి క్రేజ్ తెచ్చుకున్నాడు. కొన్నాళ్ల క్రితం తెలుగులో ఉప్పెన చిత్రంలో ప్రతినాయకుడిగా నటించి మనోళ్లకు బాగా దగ్గరయ్యాడు.

షారూఖ్ ఖాన్ జవాన్‌లో విలన్‌గా తన నట విశ్వరూపాన్ని చూపించాడు. ఇలా ఎప్పటికప్పుడు వైవిధ్యమైన సినిమాలు తీస్తున్న సేతుపతి.. ప్రస్తుతం మిష్కిన్ దర్శకత్వంలో ట్రైన్, తెలుగు దర్శకుడు పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో ఓ చిత్రం చేస్తూ బిజీగా ఉన్నాడు.

అలానే 'కాక్కా ముట్టై' ఫేమ్ మణికంఠన్ దర్శకత్వంలో ఓ వెబ్ సిరీస్ చేసేందుకు సేతుపతి రెడీ అవుతున్నాడు. గత కొన్నాళ్లుగా హీరోగా హిట్ లేక డీలా పడిపోయిన విజయ్ సేతుపతికి హిట్ ఇచ్చిన సినిమా మహారాజ. గతేడాది రిలీజైంది. తొలుత థియేటర్లలో ఆపై ఓటీటీలోనూ బ్లాక్ బస్టర్ రెస్పాన్స్ అందుకుంది.

ఇది విజయ్ సేతుపతికి 50వ చిత్రం కావడం విశేషం. ఇదే సినిమా చైనీష్ లోనూ అనువాదం అయ్యి చైనాలో రిలీజై మంచి వసూళ్లు సాధించింది. కాగా మహారాజా చిత్రానికి సీక్వెల్ చేయాలని విజయ్ సేతుపతి ఆలోచిస్తున్నట్లు, దానికి తగ్గ కథను సిద్ధం చేయమని దర్శకుడు నితిలన్ స్వామినాథన్ కు చెప్పినట్లు తెలుస్తోంది.

కాగా విజయ్ సేతుపతి ప్రస్తుతం చేస్తున్న సినిమాలు పూర్తి చేసిన తర్వాత మహారాజ 2 మొదలు పెడతారా లేదంటే వాటితో పాటే ప్రారంభించి పూర్తి చేస్తారా అనేది చూడాలి?

# జైలర్-2 లో బాలకృష్ణ..



'జైలర్' సినిమాతో మంచి కమ్‌బ్యాక్ ఇచ్చిన సూపర్ స్టార్ రజినీకాంత్.. ఇప్పుడు వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. అందులో 'జైలర్2' ఒకటి. సూపర్ హిట్ సక్సెస్ అందుకున్న జైలర్‌కు సీక్వెల్‌గా వస్తున్న ఈ మూవీకి నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్ నుంచి ఇప్పటికే వచ్చిన పలు అప్‌డేట్స్ ఆకట్టుకోగా.. ఇటీవల వచ్చిన టీజర్ కు సోషల్ మీడియాలో విశేష స్పందన లభించింది. దీంతో సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అంతే కాకుండా.. మొదటి పార్ట్‌లో నటించిన నటీనటులు వసంత్ రవి, మీర్నా మీనన్, యోగిబాబు, వినాయకన్, శివరాజ్ కుమార్, మోహన్ లాల్ వంటి వారు ఇప్పుడు 'జైలర్2'లో నటిస్తున్నట్లు తెలుస్తుంది.

అయితే.. టీజర్ తర్వాత ఈ మూవీ నుంచి మరో అప్‌డేట్ రాలేదు. దీంతో ఈ సినిమా నుంచి వచ్చే అప్‌డేట్స్ కోసం సూపర్ స్టార్ ఫ్యాన్స్ ఎంతో ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే సూపర్ స్టార్ ఫ్యాన్స్‌తో పాటు నందమూరి అభిమానులకు కూడా కిక్ ఇచ్చే ఓ న్యూస్ ఇప్పుడు కోలీవుడ్ వర్గాల నుంచి గట్టిగా ప్రచారం అవుతుంది. 'జైలర్2'లో నందమూరి నటసింహం బాలకృష్ణ కామియో రోల్‌లో నటిస్తున్నట్లు తమిళ్ వర్గాల నుంచి సమాచారం. ఇప్పటికే దీనికోసం బాలయ్యతో సంప్రదింపులు జరపగా ఆయన కూడా ఓకే చేసినట్లు తెలుస్తుంది. దీనిపై త్వరలోనే అఫీషియల్ అనౌన్స్‌మెంట్ కూడా వచ్చే అవకాశం ఉన్నట్లు వైరల్ అవుతున్న ట్వీట్స్.. రజినీకాంత్ సినిమాపై భారీ హైప్ క్రియేట్ చేస్తున్నాయి.



# హాని చేసే వారికి మద్దతు ఇవ్వడం బాధాకరం

ఏప్రిల్ 22న జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే. అయితే ఈ దాడి యావత్ భారతీయులను కలచివేసింది. ఇందులో అమాయకపు పర్యాటకులను దాదాపు 26 మందిని ప్యాంట్స్ విప్పించి మరీ హిందువులను కన్ఫర్మ్ చేసుకుని కాల్చేశారు. జమ్మూకాశ్మీర్ అందాలను చూడటానికి వెళ్లిన పెళ్లైన కొత్త జంటలు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ సంఘటన భారతీయులను కన్నీరు పెట్టేలా చేసింది. ఇక ఇదంతా చేసింది పాకిస్తాన్ వారేనని అనుమానంతో సిందూ నది నుంచి వెళ్లాల్సిన నీరును కూడా భారత్ ఆపేసింది.

గత కొద్ది రోజుల నుంచి సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా ఈ ఘటనకు సంబంధించిన పోస్టులే దర్శనమిస్తున్నాయి. ఇప్పటికీ ఈ ఉగ్రదాడిపై పలువురు సినీ తారలు స్పందిస్తున్నారు. అయితే భారత్‌లో ఉన్న పాకిస్తాన్ వారిని అక్కడికి తరలిస్తున్న విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే.. తాజాగా, టాలీవుడ్ యంగ్ హీరోయిన్, మెగా కోడలు లావణ్య త్రిపాఠి(Lavanya Tripathi) ఓ వీడియోను షేర్ చేస్తూ ఇంట్రెస్టింగ్ పోస్ట్ పెట్టింది. ఓ హిందూ మహిళ రోడ్‌పై వెళ్తుండగా.. అక్కడ పాకిస్తాన్ జెండాలు కనిపించడంతో వాటిని తిసేసి పడేసింది. దీంతో అక్కడున్న వారంతా ఆమెపై ఫైర్ అయ్యారు. అంతేకాకుండా కొంతమంది పురుషులు తిడుతూ ఆమె మీదకు వెళ్లారు. వాటిని పెట్టాలని డిమాండ్ చేశారు. దీంతో భయపడిపోయిన మహిళ జెండాలను పెట్టేందుకు అంగీకరించింది. కానీ తన వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేయకూడదని కోరింది. ఇక దానికి వారు కూడా అంగీకరించారు. కానీ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఇక ఈ వీడియోపై.. లావణ్య స్పందిస్తూ.. "మన సైనికులు తమ ప్రాణాలతో దేశాన్ని రక్షిస్తుండగా, కొందరు దేశానికి హాని కలిగించే వారికి మద్దతు ఇవ్వడం చూడటం బాధాకరం. దేశం లోపలి నుండి శుద్ధి చేయాల్సిన సమయం ఇది" అనే క్యాప్షన్ జత చేసింది.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# పంజాబ్ ఆరో విజయం..



ఐపీఎల్ (IPL) 18లో చెన్నై సూపర్ కింగ్స్ కు మరో హ్యాట్రిక్ ఓటమి. చెపాక్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో సీఎస్కేపై పంజాబ్ కింగ్స్ 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన చెన్నై 19.2 ఓవర్లలో 190 పరుగులకు ఆలౌట్ అయింది. సామ్ కరన్ (88; 47 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరిశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 19.4 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ శ్రేయస్ అయ్యర్ (72; 41 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లు), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (54; 36 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధశతకాలతో వీర విహారం చేశారు. ప్రియాంశ్ ఆర్య (23), శశాంక్ సింగ్ (23) పరుగులు చేశారు. చెన్నై బౌలర్లలో పతిరన 2, ఖలీల్ అహ్మద్ 2, నూర్ అహ్మద్, జడేజా తలో వికెట్ పడగొట్టారు.

10 మ్యాచ్‌ల్లో ఎనిమిదో ఓటమి చవిచూసిన చెన్నై అధికారికంగా ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది. చెపాక్‌లో సీఎస్కేకు వరుసగా ఇది ఐదో ఓటమి. ఐపీఎల్ చరిత్రలో ధోనీ సేన సొంతమైదానంలో వరుసగా ఇన్ని మ్యాచ్‌ల్లో ఓడిపోవడం ఇదే తొలిసారి. ఇక ఈ సీజన్‌లో పంజాబ్‌కు ఇది ఆరో విజయం (10 మ్యాచ్‌ల్లో). ఈ గెలుపుతో పంజాబ్ (13) పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి దూసుకెళ్లింది.



చెన్నై బ్యాటర్లలో సామ్‌కరన్ హాఫ్ సెంచరీ చేయగా.. డెవాల్డ్ బ్రెవిస్ (32; 26 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించాడు. మిగతా బ్యాటర్లు చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేదు. షేక్ రషీద్ (11), ఆయుష్ మాత్రే (7), రవీంద్ర జడేజా (17) ఎక్కువసేపు క్రీజులో నిలవకపోవడంతో చెన్నై 48 పరుగులకు 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో సామ్‌కరన్, బ్రెవిస్ సీఎస్కేను ఆదుకున్నారు. ఈ జోడీ నాలుగో వికెట్‌కు 78 పరుగుల భాగస్వామ్యాన్ని (50 బంతుల్లో) నెలకొల్పింది. బ్రెవిస్‌ను ఒమర్జాయ్ ఔట్ చేశాడు. యాన్సెన్ బౌలింగ్‌లో సామ్ కరన్ ఐదో వికెట్‌గా వెనుదిరిగాడు. చాహల్ 19 ఓవర్‌లో నాలుగు వికెట్లు పడగొట్టాడు. రెండో బంతికి ధోనీ (11) ఔట్ చేశాడు. మూడో బంతికి రెండు పరుగులు రాగా.. తర్వాత దీపక్ హుడా (2), అన్షుల్ కాంబోజ్ (0), నూర్ అహ్మద్ (0) వరుస బంతుల్లో పెవిలియన్‌కు పంపించాడు. దీంతో చాహల్‌కు హ్యాట్రిక్ దక్కింది. ఈ క్రమంలోనే మైదానంలో తనదైన శైలిలో సంబరాలు చేసుకున్నాడు. అర్ష్‌దీప్‌సింగ్ 2, యాన్సెన్ 2, ఒమర్జాయ్, హర్‌ప్రీత్ బ్రార్‌లు చెరో వికెట్ తీశారు.





## కోహ్లీపై సంజయ్ మంజ్రేకర్ విమర్శలు..



మాజీ క్రికెటర్, కామెంటేటర్ అయిన సంజయ్ మంజ్రేకర్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు మీద, కింగ్ విరాట్ కోహ్లీ మీద సోషల్ మీడియాలో వివాదాస్పద కామెంట్లు చేస్తుంటాడు. ఇక, ఇటీవల ముంబై, బెంగళూరు మ్యాచ్ సందర్భంగా సంజయ్ చేసిన కామెంట్లు మరింత వివాదాస్పదమయ్యాయి. బుమ్రా, కోహ్లీ పోరును ఇకపై బెస్ట్ వర్సెస్ బెస్ట్‌గా పరిగణించలేమని సంజయ్ వ్యాఖ్యానించాడు. అలాగే ఐపీఎల్ 2025 టాప్ టెన్ బ్యాటర్ల లిస్ట్‌లో కోహ్లీ పేరును సంజయ్ పక్కన పెట్టాడు.

ఈ ఏడాది ఐపీఎల్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో కోహ్లీ టాప్‌లో ఉంటున్నాడు. అలాంటి కోహ్లీని మంజ్రేకర్ స్ట్రైక్ రేట్ సాకు చూపి పక్కన పెట్టాడు. కోహ్లీ స్ట్రైక్ రేట్ తక్కువ ఉందని పరోక్షంగా ఎద్దేవా చేశాడు. సంజయ్ మంజ్రేకర్ తీరుపై విరాట్ కోహ్లీ సోదరుడు వికాస్ మండిపడ్డాడు. సోషల్ మీడియా ద్వారా అతడికి చురకలు అంటించాడు. వన్డేల్లో కేవలం 64+ స్ట్రైక్ రేట్‌తో మాత్రమే పరుగులు చేసిన సంజయ్ మంజ్రేకర్.. 200+ స్ట్రైక్ రేట్‌తో పరుగులు చేసే వారి గురించి చులకనగా మాట్లాడతాడని వికాస్ కామెంట్ చేశాడు. ఆ కామెంట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

కోహ్లీ ప్రస్తుత సీజన్‌లో ఇప్పటివరకు 10 మ్యాచ్‌లు ఆడి 443 పరుగులు చేశాడు. అయితే అతడి స్ట్రైక్ రేట్ మాత్రం 138.87 మాత్రమే. ఈ సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన టాప్ టెన్ బ్యాటర్లలో ఒక్క కోహ్లీ మాత్రమే 145 కంటే తక్కువ స్ట్రైక్ రేట్‌ను కలిగి ఉన్నాడు. ఆ పాయింట్‌నే మంజ్రేకర్ హైలెట్ చేస్తూ విమర్శలు చేస్తున్నాడు. కోహ్లీ స్ట్రైక్ రేట్ తక్కువగానే ఉన్నప్పటికీ ఆర్సీబీ విజయాల్లో మాత్రం కోహ్లీదే కీలక పాత్ర అని చెప్పక తప్పదు.

## పాక్‌లో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు సాహసోపేత నిర్ణయం

ఏప్రిల్ 22న జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో గల ప్రశాంతమైన బైసారన్ లోయలో పాక్ ఉగ్రమూకలు కాల్పులకు తెగబడి 26 మంది పర్యాటకులను పొట్టన పెట్టుకున్నారు. ఈ ఉగ్రదాడి తర్వాత భారత ప్రభుత్వం పాక్‌పై చాలా సీరియస్‌గా ఉంది. ఏ క్షణంలోనైనా భారత బలగాలు పాకిస్తాన్‌పై దాడులు చేయవచ్చని ప్రచారం జరుగుతుంది.

పాక్‌లో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ బంగ్లాదేశ్ పురుషుల క్రికెట్ జట్టు ఓ సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. పాకిస్తాన్‌లో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడేందుకు ఒప్పుకుంది. ఈ సిరీస్ మే 25 నుంచి జూన్ 3 వరకు జరుగుతుంది.

ఫ్యూచర్ టూర్ ప్రోగ్రాం (FTP) ప్రకారం పాక్ పర్యటనలో బంగ్లాదేశ్ మూడు వన్డేలు, మూడు టీ20లు ఆడాల్సి ఉండింది. అయితే వచ్చే ఏడాది టీ20 వరల్డ్‌కప్ జరుగనుండటంతో ఇరు జట్ల బోర్డులు మూడు వన్డేల సిరీస్‌కు బదులు అదనంగా రెండు టీ20లు ఆడేందుకు ఒప్పందం చేసుకున్నాయి.

ఈ సిరీస్‌కు సంబంధించిన షెడ్యూల్‌ను పాకిస్తాన్ క్రికెట్ బోర్డు ఇవాళ (ఏప్రిల్ 30) ప్రకటించింది. ఈ సిరీస్‌లోని మ్యాచ్‌లు ఫైసలాబాద్, లాహోర్ నగరాల్లో జరుగనున్నాయి. మే 25, 27న తొలి రెండు టీ20లు ఫైసలాబాద్‌లో జరుగనుండగా.. లాహోర్‌లోని గడాఫీ స్టేడియంలో మిగిలిన మూడు టీ20లు మే 30, జూన్ 1, జూన్ 3 తేదీల్లో జరుగనున్నాయి. ఈ సిరీస్ కోసం బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు మే 21న పాకిస్తాన్‌కు చేరుకుంటుంది. ఫైసలాబాద్‌లో ఆ జట్టు మే 2224వ తేదీ వరకు ప్రాక్టీస్ సెషన్స్‌లో పాల్గొంటుంది.

ఇదిలా ఉంటే, పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత ప్రభుత్వం చాలా విషయాల్లో పాక్‌ను కోలుకోలేని దెబ్బలు కొట్టింది. సింధు జలాల ఒప్పందం రద్దు సహా ఆ దేశ ట్విటర్, సినిమాలపై నిషేధం విధించింది. పాక్‌కు చెందిన 16 యూట్యూబ్ ఛానళ్లను, ఆ దేశ జర్నలిస్ట్‌లను కూడా బ్యాన్ చేసింది. తాజాగా పాక్‌కు అప్పు ఇవ్వొద్దని IMFకు సూచించింది.




## అప్పుడు రిటైర్మెంట్ ఇద్దామనుకున్నా..



భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఆస్ట్రేలియా పర్యటనలో అనూహ్యంగా రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. మూడో టెస్టు తర్వాత అశ్విన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికి అందరికీ షాకిచ్చాడు. అయితే, గతేడాది బంగ్లాదేశ్‌తో తొలి టెస్టు ఆడటం ద్వారా అతను కెరీర్‌లో 100వ టెస్టు ఆడాడు. ఆ మ్యాచ్ తర్వాత అశ్విన్ రిటైర్ అవ్వాలని భావించడట. ఈ విషయాన్ని తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో అశ్వినే వెల్లడించాడు. కానీ, ఆ టెస్టులో సెంచరీతోపాటు ఆరు వికెట్లు తీసి రాణించడంతో తన నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నట్టు అశ్విన్ తెలిపాడు. 'నిజాయతీగా చెప్పాలంటే నా 100వ టెస్టు తర్వాత రిటైర్ కావాలనుకున్నా. బంగ్లాదేశ్‌తో చెన్నయ్‌లో జరిగే టెస్టుతో ముగించాలనుకున్నా. కానీ ఆ మ్యాచ్‌లో శతకంతోపాటు ఆరు వికెట్లు తీశా. బాగా ఆడుతున్నప్పుడు నిర్ణయం తీసుకోవడం చాలా కష్టం. ఆడటం సరైందే అనుకున్నా. అందుకే కొనసాగాను.' అని చెప్పాడు. అయితే, కుటుంబానికి సమయం కేటాయించకపోవడం రిటైర్మెంట్‌కు దారితీసిన అంశాలలో ఒకటని తెలిపాడు. అలాగే, ఆస్ట్రేలియాతో తొలి టెస్టులో తనను పక్కనపెట్టడం ఎమోషనల్‌కు గురి చేసిందని, రిటైర్మెంట్‌కు పరోక్షంగా అది కూడా ఓ కారణమని వెల్లడించాడు.

## లెజెండరీ షూటింగ్ కోచ్ సన్నీ థామస్ కన్నుమూత



ప్రఖ్యాత షూటింగ్ కోచ్, మాజీ జాతీయ చాంపియన్ సన్నీ థామస్(Sunny Thomas) కన్నుమూశారు. ఆయన వయసు 83 ఏళ్లు. సన్నీ థామస్ షూటింగ్ జట్టుకు కోచ్‌గా ఉన్న సమయంలో భారత్ అనేక టోర్నీల్లో అత్యద్భుత ప్రదర్శన ఇచ్చింది. కొట్టాయంలోని ఉజావూర్ ఇంట్లో ప్రాణాలు విడిచారు. బ్రేక్ ఫాస్ట్ చేసిన తర్వాత అతనికి స్ట్రోక్ వచ్చినట్లు గుర్తించారు. ఆ సమయంలో ఆయన భార్య జోసమ్మ అక్కడే ఉన్నారు. తండ్రి సన్నీ థామస్ గుండెపోటుతో మృతిచెందినట్లు కొడుకు మనోజ్ సన్నీ పేర్కొన్నాడు.

కొట్టాయం జిల్లాలోని తిడనాడ్‌లో సెప్టెంబర్ 26, 191లో ఆయన జన్మించారు. రైఫిల్ షూటింగ్‌లో ఆయన జాతీయ చాంపియన్. అకాడమిక్స్‌లో ఇంగ్లీష్ బోధించేవారు. 1993 నుంచి 2012 వరకు భారత షూటింగ్ బృందానికి కోచ్‌గా చేశారాయన. ఆయన కోచ్‌గా ఉన్న సమయంలో ఇండియా .. ఒలింపిక్స్, వరల్డ్, ఏషియన్ , కామన్‌వెల్త్ గేమ్స్‌లో అనేక పతకాలు సాధించింది. 108 బంగారు, 74 సిల్వర్, 53 కాంస్య పతకాలు సాధించింది. రైఫిల్ 3 పొజిషన్ ఓపెన్ సైట్ ఈవెంట్‌లో నేషనల్ చాంపియన్‌గా నిలిచాడతను.

కొట్టాయం రైఫిల్ క్లబ్‌లో అతను షూటింగ్ ప్రారంభించాడు. సన్నీ థామస్ జాతీయ కోచ్‌గా ఉన్న సమయంలో.. అనేక మంది యువ షూటర్లు ఆవిర్భవించారు. 2004 ఏథేన్స్ ఒలింపిక్స్‌లో మేజర్ రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ (సిల్వర్), 2008లో అభినవ్ బింద్రా( గోల్డ్), 2021 లండన్ ఒలింపిక్స్‌లో విజయ్ కుమార్ (సిల్వర్), గగన్ నారంగ్ (బ్రాంజ్)లు పతకాలు అందుకున్నారు.

## మమ్మల్నే ఓడిస్తారా ? ప్రతీకారం తీర్చుకున్న బంగ్లాదేశ్

జింబాబ్వేతో తొలి టెస్టులో ఎదురైన ఓటమికి బంగ్లాదేశ్ ప్రతీకారం తీర్చుకుంది. చటోగ్రామ్ వేదికగా జరిగిన రెండో టెస్టులో జింబాబ్వేను ఇన్నింగ్స్ 106 పరుగుల తేడాతో బంగ్లా జట్టు చిత్తు చేసింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే.. తమ మొదటి ఇన్నింగ్స్‌లో 227 పరుగులకు ఆలౌటైంది.

జింబాబ్వే బ్యాటర్లలో సీన్ విలియమ్స్(67), నిక్ వెల్చ్(54) హాఫ్ సెంచరీలతో రాణించారు. మిగితా బ్యాటర్లంతా దారుణంగా విఫలమయ్యారు. బంగ్లా బౌలర్లలో స్పిన్నర్ తైజుల్ ఇస్లాం 6 వికెట్లు పడగొట్టి జింబాబ్వే పతనాన్ని శాసించాడు. అతడితో పాటు నయీమ్ హసన్ రెండు, తాంజిమ్ ఒక్క వికెట్ సాధించారు.





అనంతరం బంగ్లాదేశ్ తమ మొదటి ఇన్నింగ్స్‌లో 444 పరుగుల భారీ స్కోర్ సాధించింది. బంగ్లా బ్యాటర్లలో షాద్మాన్ ఇస్లాం(120), మెహిదీ హసన్ మీరాజ్(104) అద్భుతమైన సెంచరీలతో చెలరేగారు. వారిద్దరితో పాటు ముష్ఫికర్ రహీం(40), మోనిమల్(33), షకీబ్(41) రాణించారు. జింబాబ్వే బౌలర్లలో విన్సెంట్ మసెకేసా 5 వికెట్లు పడగొట్టగా.. ముజారబానీ, వెల్లింగ్టన్ మసకడ్జా బెన్నట్ తలా వికెట్ సాధించారు. ఆ తర్వాత సెకెండ్ ఇన్నింగ్స్‌లో కూడా జింబాబ్వే ఆట తీరు ఏ మాత్రం మారలేదు. బంగ్లా బౌలర్ల దాటికి రెండో ఇన్నింగ్స్‌లో జింబాబ్వే 111 పరుగులకే కుప్పకూలింది.

బంగ్లా బౌలర్లలో మెహదీ హసన్ 5 వికెట్లతో చెలరేగగా.. తైజుల్ ఇస్లాం మూడు వికెట్లు పడగొట్టాడు. జింబాబ్వే బ్యాటర్లలో బెన్ కుర్రాన్(46) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈ విజయంతో రెండు టెస్టుల సిరీస్‌ను 11తో బంగ్లా సమం చేసింది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in